1st Happy Work Anniversary.

షణ్ముఖ SHANMUKHAVELUGU వెలుగు

RNI : APTEL / 2023 / 89152

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

సంపుటి : 2 సంచిక : 342 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 11 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 342 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 11 December 2025 PAGES : 8 PRICE : 3/-

# రూ.వందల కోట్లు దోచుకొని చిన్న దొంగతనం అంటావా: జ్యోతుల నెహ్రూ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 10)

హిందువులపై జగన్‌కి ఎంత ద్వేషం ఉందో ఆయన తీరు చూస్తే అర్థమవుతుందని తితిదే బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పరకామణి చోరీ కేసు విషయంలో భక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారి హుండీ డబ్బులు లెక్కించే క్రమంలో చోరీకి పాల్పడి .. కొన్ని వందల కోట్ల రూపాయలు సంపాదించారని, దానిని చిన్న దొంగతనంగా చూపించేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. "రూ.వేల కోట్లు దొచుకున్న మీకు.. పరకామణి చోరీ కేసు చిన్నదిగా కనిపించడం సహజమే. జగన్, వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి.. నూటికి నూరు శాతం పరకామణి కేసులో భాగంగా ఉన్నారనేది వాస్తవం. ఒక్కసారి గతానికి వెళ్తే.. వీళ్ల కేసులను ఎలా తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేశారో అందరికీ తెలుస్తుంది. వైఎస్ వివేకా, -మిగతా 2లో

# నా శాఖలో 10 వేల ప్రమోషన్లు ఇచ్చాం

ఉద్యోగులతో పవన్ కల్యాణ్ మాటామంతీ

టీటీడీలో అవినీతిని బయటకు తీస్తామన్న డిప్యూటీ సీఎం

జీతాలు ఆలస్యం చేస్తున్న సర్పంచ్‌లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 10)

గత ప్రభుత్వ హయాంలో బదిలీలు, పదోన్నతులకు రేట్ కార్డ్ పెట్టి వ్యాపారం చేశారని, తమ ప్రభుత్వంలో మాత్రం పారదర్శకంగా అరతకే ప్రాధాన్యత ఇచ్చామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో నిర్వహించిన 'మాటామంతీ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన శాఖలో పెండింగ్‌లో ఉన్న 10 వేల పదోన్నతులను పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. పల్లెలే దేశానికి వెన్నెముక అనే నమ్మకంతోనే పంచాయతీరాజ్ శాఖను తాను తీసుకున్నానని పవన్ తెలిపారు. తన తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగేనని, ప్రమోషన్ కోసం -మిగతా 2లో

# మీ డబ్బు.. మీ హక్కు క్లెయిమ్ చేయని ఆస్తులపై ప్రధాని మోదీ పోస్ట్




(షణ్ముఖ వెలుగు,ఢిలీ,డిసెంబర్ 10)

క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. అందుకోసం 'మీ డబ్బు.. మీ హక్కు' మూమెంట్‌లో పాల్గొనాలని సూచించారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78 వేల కోట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో రూ.14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3వేల కోట్లు, డివిడెండ్లు రూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకు నేందుకు సంబంధిత వెబ్‌సైట్లను ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్మును తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. "మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగం కండి. -మిగతా 2లో

## ప్రజల ఆకాంక్షల మేరకు

# పథకాల్లో మార్పులు, చేర్పులు జరగాలి




(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 10)

ప్రజల ఆకాంక్షల మేరకు పథకాల్లో మార్పులు, చేర్పులు జరగాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి శాఖ చేసిన పనులన్నీ తన వద్ద రికార్డు రూపంలో ఉన్నాయని చెప్పారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల సదస్సు నిర్వహించారు. వృద్ధిరేటు పెంపునకు తీసుకోవాల్సిన అంశాలు, అమలు ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

"అనంతపురం వేరుశనగ రైతులకు దేశంలోనే తొలిసారి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం. ఆ జిల్లాలో కరవు తీర్చేందుకు ఇజ్రాయెల్ సాంకేతికతను పరిశీలించాం. రాయలసీమలో పశువులకు గడ్డి కూడా దొరకని పరిస్థితి ఉండేది. అనంతపురం జిల్లాలో నాణ్యమైన వేరుశనగ పండేలా చర్యలు చేపట్టాం. అన్నా హజారే, రాజేంద్రసింగ్ స్ఫూర్తితో జలసంరక్షణ చేపట్టాం. రాయలసీమలో ఇప్పుడు భూగర్భజలాలు పైకి వచ్చాయి. భూగర్భజలాలు 3 మీటర్లకు చేరితే ఖర్చుపెట్టే బడ్జెట్ తగ్గుతుంది. సౌరశక్తి వినియోగించుకుంటే విద్యుత్ డిమాండ్ బాగా తగ్గుతుంది. ఈ ఏడాది కరెంట్ ఛార్జీలు పెంచం. దేశంలో ఇండస్ట్రియల్ పార్కులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం మనదే" అని చంద్రబాబు అన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తాం: ఏపీ హోంమంత్రి అనిత భరోసా

హోంమంత్రి అనితతో భేటీ అయిన అగ్రిగోల్డ్ బాధితులు

కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్

గత ప్రభుత్వం న్యాయం చేయడంలో విఫలమైందని ఆరోపణ

ప్రతి బాధితుడికి న్యాయం చేస్తామని మంత్రి అనిత భరోసా



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 10)

అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని బాధితుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సచివాలయంలో నిన్న హోంమంత్రి వంగలపూడి అనితతో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ యూనియన్ ప్రతినిధులు భేటీ అయ్యారు. తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బాధితులకు అండగా ఉంటామని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఈ సందర్భంగా మంత్రి అనిత హామీ ఇచ్చారు.

ఈ సమావేశం అనంతరం -మిగతా 2లో

# గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో మంత్రి లోకేశ్ భేటీ



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,డిసెంబర్ 10)

అమెరికాలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో ఆయన భేటీ అయ్యారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి కుటుంబంలో ఏఐ ప్రొఫెషనల్ ఉండాలనేది చంద్రబాబు విజన్ అని అన్నారు. ఏపీలో గూగుల్ పెట్టుబడి ప్రారంభం మాత్రమేనని చెప్పారు. మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తామన్నారు. డ్రోన్ సిటీలో అసెంబ్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఇంటెల్ ఐటీ సీటీవో -మిగతా 2లో

# ఆంధ్రప్రదేశ్‌లో విద్యావిధానం భేష్ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,డిసెంబర్ 10)



ఆంధ్రప్రదేశ్‌లో మంచి విద్యా విధానాలు అమలు చేస్తున్నారని కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో పాఠశాలలు -మిగతా 2లో

# జీఎస్‌డీపీలో ఏటా 15 శాతం వృద్ధితో 2047కి రూ.66 లక్షల తలసరి ఆదాయం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 10)

జగన్ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల 2019-24 మధ్య ఐదేళ్లలో రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల జీఎస్‌డీపీని నష్టపోయిందని, ప్రభుత్వం రూ.72 వేల కోట్ల ఆదాయం కోల్పోయిందని స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ సి.కుటుంబరావు తెలిపారు. ఈ 18 నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ఆర్థిక వ్యవస్థ మళ్లీ గాడినపడి, వేగంగా పురోగమిస్తోందని ఆయన మంగళవారం తెదేపా కేంద్ర -మిగతా 2లో

# మిరపలో 'నల్లతామర' ప్రభావంపై నివేదిక ఇవ్వండి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 10)

మిరపలో నల్లతామర పురుగు ప్రభావంపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఉద్యాన అధికారుల్ని ఆదేశించారు. 'మిరప రైతుకు నిద్ర కరవే' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో వచ్చిన కథనంపై మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో మాట్లాడారు. పురుగు ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాలకు శాస్త్రవేత్తలను పంపాలని సూచించారు. మందుల పిచికారీపై సలహాలు ఇచ్చేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. 2021 నుంచి పురుగు దాడి చేస్తోందని, గ్రామస్థాయిలో అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నామని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు మంత్రికి వివరించారు.

**వాడిన మందులు మళ్లీ వాడొద్దు: శాస్త్రవేత్తలు**

నల్లతామర పురుగు నివారణకు రైతులు సామూహికంగా జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని వైఎస్సార్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సూచించారు. -మిగతా 2లో

# మూడు నెలల్లో అందుబాటులోకి రాష్ట్ర ల్యాబ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 10)

విజయవాడలో నిర్మాణంలో ఉన్న ఔషధ నియంత్రణ శాఖ రాష్ట్రస్థాయి ల్యాబ్‌ను మరో మూడు నెలల్లో అందుబాటులోకి తెస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మంగళగిరిలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయం నుంచి వర్చువల్‌లో విశాఖ,




కర్నూలులలోని ప్రాంతీయ ప్రయోగశాలలతోపాటు.. శ్రీకాకుళం, అమలాపురం, నరసరావుపేట, ఒంగోలు, కావలి, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, మదనపల్లెలలో పరిపాలన కార్యాలయాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. రూ.11.12 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ 11 భవనాలు అందుబాటులోకి రావడంతో అద్దె భవనాల సమస్య పరిష్కారమైందన్నారు. 'ప్రస్తుతం విజయవాడలోని ప్రయోగశాలలో ఏడాదికి 4,000 మందుల నమూనాల నాణ్యతను పరీక్షిస్తున్నాం. కొత్తగా ప్రారంభించిన ప్రాంతీయ ల్యాబుల్లో 3,000 నమూనాల పరీక్షలకు అవకాశం ఉంది. రాష్ట్రస్థాయి ల్యాబ్ అందుబాటులోకి వస్తే అదనంగా మరో 7,000 నమూనాల పరీక్షలకు వీలుంటుంది' -మిగతా 2లో

# లోతైన సముద్రపు చేపలు పట్టే ఓడలు

## పెంపు పై మాగుంట ప్రశ్న

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)**

దేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోస్తా ప్రాంతాలలో లోతైన సముద్రపు చేపలు పట్టే మొత్తం ఓడలు, పెంపుదల, పథకాలు, నిధులు, లబ్దిదారులు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖామాత్యులు, రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ సమాధానమిస్తూ ఎగుమతి కమిటీ అంచనా ప్రకారం దేశంలో ఎకనమిక్ జోన్ పరిధిలో మత్య వనరుల దిగుబడి 53 లక్షల టన్నులు కాగా, సముద్రపు 2.31 లక్షల టన్నులని తెలిపారు. ప్రస్తుతం 44.95 లక్షల టన్నుల సముద్ర మత్య సంపదను ఉపయోగించుకుంటున్నదని తెలిపారు. లోతైన సముద్రపు చేపల వేట, నిల్వ, అమ్మకం, ఎగుమతి, ఓడలు మొదలగు విషయాలకు సంబంధించి సాంప్రదాయ మత్యకారుల నైపుణ్యాలు, సామర్థ్యాల పెంపుకు ప్రభుత్వం "నేషనల్ పాలసీ ఆన్ ఫిషరీస్ 2017" ని తీసుకొచ్చి పలు పథకాలు అమలుచేస్తుందని తెలిపారు. ప్రధాన్ మంత్రి మత్య సంపద యోజన తదితర పథకాల క్రింద రూ. 896 కోట్లు ఆర్థిక సహాయాన్ని సాంప్రదాయ మత్యకారులకు ముఖ్యంగా సహకార సంఘాలద్వార అందిస్తుందని తెలిపారు. దేశంలో అండమాన్, నికోబార్, దయ్యు, డామన్, గుజరాత్, ఒడిషా, తమిళనాడు కోస్తా ప్రాంతాలలో లోతైన సముద్రపు చేపలు పట్టే 906 ఓడలకు మొత్తం ప్రాజెక్ట్ విలువ రూ.73,440 లక్షలకు గాను రూ.31,209 లక్షలు నిధులు విడుదలకాగా, ఆంధ్రప్రదేశ్ కోస్తా ప్రాంతంలో 12 ఓడలకు మొత్తం ప్రాజెక్ట్ విలువ రూ. 960 లక్షలకుగాను రూ.233 లక్షలు నిధులు విడుదల జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కోస్తా ప్రాంతంలో 57 సాధారణ పడవల (ట్రాలర్లు) నవీకరణకు మొత్తం ప్రాజెక్ట్ విలువ రూ. 855 లక్షలకు గాను రూ.427 లక్షలు నిధులు విడుదలకాగా, ప్రధానమంత్రి మత్య సంపద యోజన పథకం క్రింద 50 ఓడల కొనుగోలు మద్దతు క్రింద మొత్తం ప్రాజెక్టు విలువ రూ. 6,000 లక్షలకు గాను రూ.1,526 లక్షలు విడుదల జరిగిందని తెలిపారు.

# అంగన్వాడీల సమస్యల పై కలెక్టరేట్ దగ్గర ధర్నా



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)**

ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అంగన్వాడీల యొక్క సమస్యల మీద డిసెంబర్ 12 కలెక్టరేట్ దగ్గర ధర్నా పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా ప్రకాశం జిల్లాలో ఉన్నటువంటి అంగన్వాడీ ఆయా, కార్యకర్తలు జిల్లా ఐసిడిఎస్ పిడికి వినతిపత్రం అందించేందుకు వెళ్ళి కలువగా పి డి ధర్నా నోటీస్ తీసుకోలేదు. ఆఫీసులో టపాలో పెట్టి రావడం జరిగిందన్నారు. అందరూ అధికారులకు డిసెంబర్ 12వ తారీఖున ప్రాజెక్ట్ మీటింగులు పెట్టమని చెప్పినారు. కొన్ని ప్రాజెక్టులలో డిసెంబర్ 12 ప్రాజెక్ట్ మీటింగ్ జరుగుతుందని అధికారులు చెప్పడం జరిగింది. కావున తమ హక్కు అయినటువంటి పోరాటాన్ని చేసుకుని వాళ్ళని ప్రాజెక్ట్ మీటింగులు ఆ రోజు వాయిదా వేయాలని డిఆర్ఓకి వినతిపత్రం సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, సిఐటియు జిల్లా కోశాధికారి పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కుర్చీలు బహూకరణ



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 10)**

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు బుధవారం పాఠశాల పూర్వ విద్యార్థులు కొర్రపాటి ప్రసాద్, శోభన, వెలగపూడి వాసవి, బిఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ లు పాఠశాలకు 21 వేల విలువగల కుర్చీలను ప్రధానం చేశారు. వీరందరికీ ప్రధానోపాధ్యాయుడు వై వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బినిడి వెంకట్రావు , తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

# మిరపలో 'నల్లతామర' ప్రభావంపై నివేదిక ఇవ్వండి

'వాడిన పురుగు మందుల్ని మళ్లీ వాడొద్దు. తక్కువ వ్యవధిలో విచక్షణారహితంగా పిచికారీ చేయొద్దు' అని పేర్కొన్నారు.లీటరు నీటికి 1 మి.లీ. 10 వేల పీపీఎం గాఢత ఉన్న వేపనూనె లేదా 2 మి.లీ. '1,500/3,000 పీపీఎం వేపనూనె' కలిపి పిచికారీ చేయాలి.34 మి.లీ. బ్రోఫ్లనిలైడ్ 20ఎస్సీ, 160 మి.లీ. ఫ్లక్సామెటమైడ్ 20ఈసీ, 40 గ్రాములు ఫిప్రానిల్ 80% డబ్ల్యూ.జి., 200 మి.లీ. స్పైరో టెట్రామాట్ 15.30% ఓడీలలో ఏదో ఒకటి ఎకరానికి సరిపోయేలా నీటిలో కలిపి పిచికారీ చేయాలి' అని తెలిపారు.

# మూడు నెలల్లో అందుబాటులోకి రాష్ట్ర ల్యాబ్

అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డీజీ గిరీశా, సంచాలకులు ఎంపీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో మంత్రి లోకేశ్ భేటీ

శేష కృష్ణపురతోనూ మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఇంటెల్ ఏటీఎంపీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతిలో ఇంటెల్ ఏఐ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఎన్ విడియా ప్రతినిధి రాజ్‌మిర్ పురితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఎన్ విడియా స్మార్ట్ ఫ్యాక్టరీ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించాలని కోరారు. భాగస్వామ్య సంస్థలు పెట్టుబడులు పెట్టేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అడోబ్ సీఈవో శంతను నారాయణ్ భేటీ అయ్యారు. ఏపీలో అడోబ్ జీసీసీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. జూమ్ ప్రెసిడెంట్ శంకరలింగంతో మంత్రి సమావేశమై ఏపీలో జూమ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ ఇచ్చారు.

# ఆంధ్రప్రదేశ్‌లో విద్యావిధానం భేష్ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. బుధవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. "సీఎస్ఆర్ నిధులతో ఏపీలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం బాగుంది. ఇతర రాష్ట్రాలకు కూడా అలాంటి విధానాలు అవలంభించవచ్చు. ఆంధ్రా మోడల్ బాగుంది, ఇతర రాష్ట్రాలూ మంచి సృజనాత్మక విధానాలు అవలంభిస్తున్నాయి. ఏపీలో నాణ్యమైన విద్యా విధానం అమల్లో చంద్రబాబు, లోకేశ్ చొరవ బాగుంది" అని కితాబిచ్చారు.

# జీఎస్‌డీపీలో ఏటా 15 శాతం వృద్ధితో 2047కి రూ.66 లక్షల తలసరి ఆదాయం

కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. "2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 13.21 శాతం కాగా, తెలంగాణ వృద్ధి రేటు 13.5 శాతంగా ఉంది. జగన్ హయాంలో 2019-24 మధ్య రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 9.1 శాతానికి పడిపోతే, తెలంగాణ 11 శాతం వృద్ధితో దూసుకెళ్లింది. ఫలితంగా తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.87 లక్షలకు చేరగా, ఏపీ తలసరి ఆదాయం రూ.2.66 లక్షల దగ్గరే ఉండిపోయింది" అని ఆయన పేర్కొన్నారు. " తెదేపా ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్- 2047 ప్రకారం 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ 18 రెట్లు పెరిగి రూ.292 లక్షల కోట్లకు, తలసరి ఆదాయం రూ.49 లక్షలకు చేరాల్సి ఉండగా, ఐదేళ్ల జగన్ దుర్మార్గ పాలన వల్ల ఆ కల నెరవేరే అవకాశం లేకుండా పోయింది" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఏటా జీఎస్‌డీపీలో 15 శాతం వృద్ధి రేటు సాధిస్తే 2047-48కి తలసరి ఆదాయం రూ.66 లక్షలకు చేరుతుందని కుటుంబరావు తెలిపారు. కొవిడ్ వంటి ఊహించని పరిస్థితులు తలెత్తి ఆర్థిక వ్యవస్థ మందగించినా... 10.3 శాతం వృద్ధి రేటు కచ్చితంగా ఉంటుందని, తలసరి ఆదాయం కనీసం రూ.25 లక్షలకు చేరడం ఖాయమని తెలిపారు. కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు శాఖ నివేదిక ప్రకారం.. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో తమిళనాడు తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయరంగంలో 34-35 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యం పెట్టుకోగా, దానిలో 65 శాతం ఇప్పటికే చేరుకున్నామని చెప్పారు.

# మీ డబ్బు.. మీ హక్కు: క్లెయిమ్ చేయని ఆస్తులపై ప్రధాని మోదీ పోస్ట్

ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ.. ఇవన్నీ ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయి" అని ప్రధాని తన పోస్టులో రాసుకొచ్చారు. ఇప్పటికే రూ.2వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదార్లకు అందించామని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రజాప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ ఇప్పటికే వెల్లడించారు.

ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయభాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ, సెబీ , ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు. ప్రజలు తమ అన్‌క్లెయిమ్డ్ ఆర్థిక ఆస్తులను కనుగొనడంలో ఆర్‌బీఐ 'ఉద్గమ్', ఐఆర్‌డీఏఐ 'బీమా భరోసా', సెబీ 'మిత్రా' సమర్థంగా ఉపయోగపడుతున్నాయని మంత్రి తెలిపారు.

# రూ.వందల కోట్లు దోచుకొని చిన్న దొంగతనం అంటావా: జ్యోతుల నెహ్రూ

పరిటాల రవి కేసుల్లో సాక్షులను హతమార్చారు. ఇప్పుడు కూడా అదే విధానం అమలు చేస్తున్నారు. ఎవరైతే వాస్తవాలను నిరూపించేందుకు ప్రయత్నం చేస్తారో.. వారందరినీ వేధించడం, భయపెట్టడం, అవసరమైతే హత్యలు చేస్తున్నారు" అని జ్యోతుల నెహ్రూ ఆరోపించారు.

# నా శాఖలో 10 వేల ప్రమోషన్లు ఇచ్చాం

ఒక కుటుంబం ఎలా ఎదురుచూస్తుందో తనకు తెలుసని గుర్తుచేసుకున్నారు. అందుకే బాధ్యతలు చేపట్టగానే పదోన్నతులపై దృష్టి సారించానన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు సిఫార్సు చేసినా అర్హత, అనుభవం, పనితీరు ఆధారంగానే ప్రమోషన్లు ఇచ్చామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కొందరు ఉద్యోగులు తమ సమస్యలను పవన్ దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు సకాలంలో సంతకాలు చేయకపోవడంతో జీతాలు, బిల్లులు ఆలస్యమవుతున్నాయని వాపోయారు. దీనిపై తీవ్రంగా స్పందించిన పవన్ కల్యాణ్, నిర్లక్ష్యంగా వ్యవహరించే సర్పంచ్‌ల జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల జీతాలు ఆలస్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారిపై ఎవరు దాడులు చేసినా కఠినంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని బయటకు తీస్తామన్నారు. పవిత్రమైన లడ్డూ ప్రసాదం, పరకామణి వ్యవహారాల్లో అవకతవకలకు పాల్పడిన వారిని చట్టంతో పాటు దేవుడు కూడా శిక్షిస్తాడని వ్యాఖ్యానించారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తాం: ఏపీ హోంమంత్రి అనిత భరోసా

యూనియన్ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. 8 రాష్ట్రాల్లోని బాధితుల నుంచి అగ్రిగోల్డ్ సంస్థ రూ.7,386 కోట్లు వసూలు చేసి మోసం చేసిందని తెలిపారు. బాధితులకు న్యాయం చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నాటి సీఐడీ చీఫ్ కేసును నీరుగార్చారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ సాయం అందక రాష్ట్రంలో సుమారు 600 మంది బాధితులు, 500 మంది ఏజెంట్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో 9.50 లక్షల మందికి రూ.3,080 కోట్లు చెల్లించాల్సి ఉందని, అయితే కొందరు ఆస్తుల అటాచ్‌మెంట్‌ను అడ్డుకుంటున్నారని నాగేశ్వరరావు అన్నారు. 14 వేల మంది బాధితులు కొనుగోలు చేసిన స్థలాలను అటాచ్‌మెంట్ల నుంచి తొలగించాలని కోరారు. ఈ కేసుపై వెంటనే సిట్ ఏర్పాటు చేసి, ఆరు నెలల్లోగా న్యాయం చేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బాధితుల సమస్యలను సావధానంగా విన్న మంత్రి అనిత, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బాధితులు అధైర్యపడి ఎవరూ అఘాయిత్యాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు.

# 12న రక్షణ సేవ పెన్షనర్లకు అవగాహన సదస్సు

## జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిణి ఆర్ గుణ షీలా

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 10)**



రక్షణ సేవ పెన్షనర్లు, రక్షణ పౌర పెన్షనర్లు , కుటుంబ పెన్షనర్లు (స్పర్శ్)సంబంధించిన ఫిర్యాదులు పరిష్కారం చేయబడుతుందని జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారిణి ఆర్. గుణషీలా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న బాపట్ల జిల్లా కేంద్రం, కొత్త ఆర్టీసీ బస్టాండ్ సమీపాన ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) కళ్యాణ నందు ఉదయం 10 గంటలకు సి డి ఎ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో సిస్టం ఫర్ పెన్షన్ అడ్మినిస్ట్రేషన్ రక్ష స్పర్శ్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో రక్షణ సేవ పెన్షనర్లు, రక్షణ పౌర పెన్షనర్లు ,కుటుంబ పెన్షనర్లు (స్పర్శ్)సంబంధించిన ఫిర్యాదులు మరియు ప్రశ్నలకు రక్షణ ఖాతాల విభాగం అధికారులు, సిబ్బంది హాజరై పరిష్కారం చేయబడుతుందని, రక్షణ పెన్షనర్లు మాన్యువల్ మరియు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను కూడా సమర్పించవచ్చునని, ఈ కార్యక్రమానికి ఆర్మీ రికార్డ్స్ నుండి సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని, ఈ అవగాహన కార్యక్రమానికి గుంటూరు, బాపట్ల, పలనాడు జిల్లాలలో నివసిస్తున్న రక్షణ శాఖ పెన్షనర్లందరూ తమ ఒరిజినల్ మిలటరీ డిశ్చార్జ్ సర్టిఫికెట్లును, పెన్షన్ పేమెంటు ఆర్డర్ పెన్షన్ పాస్ బుక్,ఆధార్ కార్డు, పాన్ కార్డు మరియు తమ కుటుంబ సభ్యుల వివరములు, తమ పెన్షన్ కి లింక్ చేయబడిన మొబైల్ తీసుకొని రావాలని తెలిపారు. ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి, తమ ఫిర్యాదులను పరిష్కరం చేసుకోవచ్చునని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు. పై అంశాలకు సంబంధించి 0863-2225853, 8688817827 నెంబర్లును సంప్రదించువచ్చన్నారు.

# పర్యావరణ పరిరక్షణే అంటున్న ఎస్ఎస్ఎన్ వాలంటీర్లు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)**



స్థానిక ముంగమూరు రోడ్లోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల వాలంటీర్లు జాతీయ సేవా పథకంలో భాగంగా 6 వ రోజు యూనిట్ 1, యూనిట్ 2 కొత్తపట్నం మండలం సంకువారిగుంట, టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెంలో పర్యావరణ పరిరక్షణ అనే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ కమ్ ప్రిన్సిపల్ వై. సత్యనారాయణ రెడ్డి తెలిపారు.ఆయన మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః అన్నట్లు వృక్షాలను మనం రక్షిస్తే అని మనలను రక్షిస్తాయని రోజు రోజుకు పెరిగి పోవుచున్న కాలుష్య కోరలనుండి ఈ ధరిత్రి నీ కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పెంచి పోషించాలని, రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచే లక్ష్యం తో ఈ అవగాహన కార్యక్రమంను ఏర్పాటు చేయడం జరిగిందని వాలంటీర్లకు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాలకృష్ణ మూర్తి మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించడం, జీవవైవిధ్యాన్ని పెంచడం రాబోయే తరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించడం మన బాధ్యత అని గ్రామస్థులకు సూచించారు. మండల గ్రామ వార్డు సచివాలయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ మొక్కలు నాటడం కేవలం ఒక కార్యక్రమమే కాదు.మన భూమిపై మనం చూపే ప్రేమ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై మన రాష్ట్రాన్ని హరితహారంగా మార్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎన్ ప్రోగ్రాం అధికారులు టీ రాజేంద్రబాబు, పీ నీలిమ, పీ రవితేజ, బి శ్యామల, వైస్ ప్రిన్సిపల్ టి రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు టి నవీన్, పి ఖాజపీర్, కె రాజకుమార్, అధ్యాపకేతర సిబ్బంది, సంకువారిగుంట గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం శేషమ్మ, మండల రిసోర్స్ పర్సన్ శ్రీను, కంప్యూటర్ ఆపరేటర్ బాల మురళి, సర్పంచ్ సుబ్బరత్నం, గ్రామ పెద్దలు విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు ePaper www.shanmukhavelugu.com 3 11.12.25 గురువారం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# రూ.300 అక్రమ వసూళ్ళకు దిగిన కనిగిరి ఐసిడిఎస్ అధికారులు

## సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
## కార్యకర్తలతో తెల్లకాగితాల పై సంతకాలు
## కనిగిరి ఐసిడిఎస్ అధికారుల నిర్వాకం
## అంగన్‌వాడీ కార్యకర్తల్లో ఆందోళన



(షణ్ముఖ వెలుగు, పీసీపల్లి, డిసెంబర్ 10)

*అధికారులు రూ.300 కూడా కక్కుర్తిపడి అక్రమ వసూళ్ళకు పాల్పడే స్థితికి దిగజారారు. ఇది కేవలం ఒక్క ఐసిడిఎస్ అధికారులకే సాధ్యమవుతోంది.... ఓ వైపు కూటమి ప్రభుత్వం, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అక్రమ వసూళ్ళకు పాల్పడే అధికారుల పై వేటు వేస్తున్నారు...కాని ఇక్కడి అధికారుల్లో మాత్రం చలనం లేదు....ఎవరేమనుకుంటే మాకెందుకులే అనుకుని ఒక్కో అంగన్‌వాడీ కార్యకర్త వద్ద నెలకు రూ.300 వసూలు చేస్తున్నారంటే సదరు అధికారులకు ప్రభుత్వం జీతభత్యాలు ఇవ్వడం లేదన్న ప్రశ్న తలెత్తుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారులకు నెల నెల జీతాలు సక్రమంగానే వారి అకౌంట్లలో జమ అవుతున్నాయి. అయినా కనిగిరి ఐసిడిఎస్ అధికారుల కక్కుర్తి మాత్రం తీరడం లేదని ఈ వసూళ్ళను చూస్తే అర్థమవుతోంది...!*

వివరాల్లోకి వెళితే కనిగిరి ఐసిడిఎస్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. గౌరవ వేతనంతో పని చేసే అంగన్‌వాడీ కార్యకర్తల నుండి కూడా నిస్సిగ్గుగా నెలకు రూ.300 వసూలు చేయడం ఆశాఖ అధికారులకే చెల్లుతుంది. కనిగిరి ప్రాజెక్టు లోని పీసీపల్లి సెక్టార్‌లో ఒక్కో అంగన్‌వాడీ కార్యకర్త నుండి బలవంతంగా రూ.300లు వసూలు చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఆ విషయమై సోషల్ మీడియాలో సైతం హల్చల్ చేయడంతో ఐసిడిఎస్ అధికారులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు రకరకాల ప్రయత్నాలు మొదలుపెట్టారు. అందులో భాగంగా పీసీపల్లి సెక్టార్ సమావేశం కనిగిరి ఐసిడిఎస్ కార్యాలయంలో ఇటీవలే జరిగింది. నెలకో సారి మాత్రమే సెక్టార్ సమావేశం జరుగుతుంది. కానీ సమావేశం జరిగిన రెండో రోజే హడావుడిగా కార్యకర్తలను కనిగిరికి పిలిపించి తెల్లకాగితాల పై సంతకాలు చేయించుకున్నారు. తెల్లకాగితాల పై సంతకాలు ఎందుకని ఓ కార్యకర్త సిడిపిఓ, సూపర్‌వైజర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. ఆ ఒక్క కార్యకర్త మాత్రం ససేమిరా సంతకం చేయను అని చెప్పడంతో ఆమె పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మిగతా కార్యకర్తలు తెల్లకాగితాల పై సంతకం, అంగన్‌వాడీ కేంద్రం పేరు, ఫోన్ నెంబర్ వేయించుకుని పంపినట్లు కార్యకర్తలు వెలుగు ప్రతినిధికి తెలిపారు. సోషల్ మీడియాలో పత్రికల్లో వచ్చే వార్తలతో మాతో సంతకాలు చేయించుకున్నారని పలువురు కార్యకర్తలు తెలిపారు. గౌరవవేతనంతో కుటుంబాన్ని వెల్లదీసుకునే కొందరు కార్యకర్తలు మీడియా వలనైనా మేమిచ్చిన డబ్బు మాకు తిరిగి ఇస్తే పండుగలకు బట్టలు అన్నా కొనుక్కుంటామని ఓ కార్యకర్త ఆవేదన వెలిబుచ్చింది. మరో కార్యకర్త మాత్రం ఇచ్చిన డబ్బులు వెనక్కు రావు కాని ఇక నుంచి అయినా నెల మామూళ్ళ వసూలు ఆపితే బాగుంటుందని చెప్పడం గమనార్హం. ఇదిలా ఉండగా ఐసిడిఎస్ అధికారులు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని కలిసి విలేకరులు మామూళ్ళు డిమాండ్ చేస్తున్నారని చెప్పడం దొంగే దొంగ అన్నట్లుగా ఉందని కనిగిరి ప్రాంతంలో చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా కనిగిరి ప్రాజెక్టులో అక్రమాల పై ఫిర్యాదులతో పాటు పత్రికల్లో వార్తలు వస్తుండడంతో గురువారం కనిగిరి ప్రాజెక్టు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది. ప్రాజెక్టు డైరక్టర్ కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నట్లు తెలుస్తోంది. సూపర్‌వైజర్లకు కూడా సెక్టార్లను మార్చడంతో పాటు అధికారులకు గట్టిగా సూచనలు ఇవ్వనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

# గ్రానైట్ యజమానులు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

## క్వారీలో హెల్త్ క్యాంపులు నిర్వహించి కార్మికుల ఆరోగ్య స్థితిగతుల గురించి తెలుసుకోవాలి
## జిల్లా కలెక్టర్ పి రాజబాబు



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 10)

మైనింగ్ కార్యకలాపాలతో పాటు వచ్చే వ్యర్థాల నిర్వహణపైన యజమానులు దృష్టి సారించడంతో పాటు మైనింగ్ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. బుధవారం చీమకుర్తిలోని గ్రానైట్ క్వారీని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మైనింగ్ అధికారులు క్వారీలో గ్రానైట్ రాళ్ళ వెలికి తీసే విధానంను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ క్రిష్ణ సాయి గ్రానైట్ కంపెనీని సందర్శించి గ్రానైట్ కటింగ్, పాలిష్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ మైనింగ్ కార్యకలాపాల ద్వారా గత సంవత్సరం రూ.180 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం రాగా, ఈ సంవత్సరం రూ.220 కోట్ల రూపాయలు లక్ష్యంగా నిర్దేశించుకొన్నారన్నారు. జిల్లాలో మైనింగ్ కార్యకలాపాల ద్వారా ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో యజమానులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ ముందు ఉంటుందన్నారు. మైనింగ్ కార్యకలాపాలతో పాటు వచ్చే వ్యర్థాల (తరువాయి 4లో...)

# గత ఐదేళ్లు అభివృద్ధి ఏది

## అప్పుడు సంతకాల సేకరన ఎందుకు చేయలేదు
## ప్రభుత్వ ఆసుపత్రి సౌకర్యాలు పట్టించుకోని వైసీపీ
## ఇప్పుడు మెడికల్ కాలేజీ నాటకమా?
## ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఫైర్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిసెంబర్ 10)

గత వైసిపి పాలనలో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిని పట్టించుకోని వైసిపి కోటి సంతకాల పేరుతో డ్రామాలాడుతోందని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఫైర్ అయ్యారు. బుధవారం అమరావతి మైదానంలో జరిగిన విలేకరుల (తరువాయి 4లో...)

# ఘనంగా గెలక్సీ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం

## నూతన అధ్యక్షులుగా శిద్దా సుధీర్ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)

ఒంగోలు కెబి రెస్టారెంట్‌లో బుధవారం జరిగిన గాలక్సీ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకార వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన గాలక్సీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు జ్యోతి ప్రజ్వలన నిర్వహించి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ 35 సంవత్సరాల చరిత్ర గల అసోసియేషన్ ఎన్నో సమస్యలు అధిగమించి పూర్తి స్థాయిలో అందరి సహకారంతో అసోసియేషన్ అభివృద్ధి చేయాలనీ నూతన కార్యవర్గ సభ్యులకు సూచించారు. అనంతరం గాలక్సీ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా శిద్దా సుధీర్ కుమార్ ప్రమాణ స్వీకారం చేసారు. వైస్ ప్రెసిడెంట్‌లుగా శ్రీధర్ ఆనంద్, శిద్దా భరత్, శిల్పారెడ్డి, జనరల్ సెక్రెటరీ గా రవి చంద్రన్, జాయింట్ సెక్రెటరీగా భాస్కర్‌రెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, ట్రెజరర్‌గా బదరి నారాయణతో పాటుగా ఎగ్జిక్యూటివ్ సభ్యులు (తరువాయి 4లో...)

# జిల్లా పోలీసుల పనితీరుపై సమీక్ష

## గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి
## నమోదైన కేసుల వివరాలు, ప్రస్తుత స్థితిగతుల పై సమగ్రంగా ఆరా
## పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు
## చెడునడతగల వ్యక్తుల పై నిత్యం నిఘా ఉంచాలి
## దౌర్జన్యాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలి
## జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతి భద్రతల సమస్యలు చోటు చేసుకోకుండా పటిష్ట నిఘా ఉంచాలి
## జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఇంకా మెరుగైన చర్యలు చేపట్టాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)

నేరాలు నియంత్రణ, లా అండ్ ఆర్డర్ పరిస్థితులు, కీలక కేసుల పురోగతి, గంజాయి రవాణా, విక్రయం నియంత్రణ, క్రైమ్ మేనేజ్‌మెంట్ వంటి పలు అంశాల పై బుధవారం గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజుతో కలిసి సింగరాయకొండ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో నమోదైన కేసుల వివరాలను ఐజీ సమీక్షించి, వాటి ప్రస్తుత స్థితిగతుల పై సమగ్రంగా ఆరాతీశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతాల్లో పెట్రోలింగ్, గస్తీ నిర్వహణను మరింత బలోపేతం చేసి నేరాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. నేర దర్యాప్తుల్లో వృత్తి నైపుణ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ముద్దాయిలను గుర్తించి (తరువాయి 4లో...)

# రొయ్యల పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళల సంక్షేమానికి అనేక పథకాలు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్




(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 10)

రొయ్యల పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. రొయ్యల సినర్జీ ప్రాజెక్టులో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాల కొరకు మత్స్య, కార్మిక శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ప్రచార యాత్ర వాహనాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అవగాహన కార్యక్రమాలపై రూపొందించిన గోడపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. రొయ్యల పరిశ్రమలలో మహిళల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి (తరువాయి 4లో...)

# కొనకనమిట్ల మండలంలో స్క్రబ్ టైపస్ కలకలం

## అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ
## అంబరపురం గ్రామంలో ఒక కేసు గుర్తింపు
## ఒంగోలు జిజిహెచ్‌కు తరలింపు
## ఆందోళన పడవలసిన పనిలేదు డాక్టర్ సురేఖ



(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, డిసెంబర్ 10)

ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం అంబపురం గ్రామంలో ఒక స్క్రబ్ టైపస్ కేసును గుర్తించారు. సదరు వ్యక్తికి ఒంగోలు జిజిహెచ్‌లో వైద్య సేవలు అందిస్తున్నట్లు కొనకనమిట్ల ప్రభుత్వ వైద్యురాలు సురేఖ తెలిపారు. పెద్దగా ఆందోళన పడాల్సిన అవసరం లేదని, దినికి చికిత్స అందుబాటులో ఉందన్నారు. లక్షణాలు గుర్తించి మెరుగైన వైద్య సహాయం అందితే ఎటువంటి ప్రాణాపాయ పరిస్థితి లేదని తెలిపారు. తీవ్ర జ్వరం, ఒళ్ళు నొప్పులు దాదాపు 6 రోజుల నుంచి 21 రోజుల లోపు జ్వరం తగ్గక పోవడం వంటి లక్షణాలుంటాయని ఆమె తెలిపారు. ఈ జ్వరం ఎక్కువుగా గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనుల కోసం పొలల్లో ఉన్న నల్లలాంటి పురుగు కుట్టడం వల్ల వస్తుందని ఆమె తెలిపారు. గ్రామీణులు వ్యవసాయ పనులు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. తీవ్ర జ్వరంతో బాదపడే వారు తప్పనిసరిగా వైద్యశాలను సంప్రదించి అవసరమైన నిర్ధరణ పరిక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు.

# సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసిల్దార్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 10)

మండలం తలమల గ్రామంలో సచివాలయాన్ని తహశీల్దార్ ఎం వి కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలోని అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజల అంకిత భావంతో పనిచేయాలని సచివాలయం సిబ్బందిని సూచించారు. సచివాలయం పరిశీలించిన కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారెడ్డితో పాటు ఏఆర్ఐ నరసింహారావు, వీఆర్వోలు కే సుబ్బారావు, రమేష్‌లు పాల్గొన్నారు.

# పలు కార్యక్రమాల్లో ఎంపిటిసి ఆకుపాటి





(షణ్ముఖ వెలుగు, సీఎస్‌పురం, డిసెంబర్ 10)

మండలంలోని శీలంవారిపల్లి గ్రామం నందు విశ్రాంత కలెక్టర్ పిడుగు బాబురావు తల్లి మంగమ్మ దిశ దిన కార్యక్రమంలో జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ టీడీపీ మండల అధ్యక్షులు సంగిశెట్టి చిన ముసలయ్య ద్వితీయ కుమారుడు సురేష్ కుమారుడి శ్యాందర్శన్ మొదటి పుట్టినరోజు వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రానైట్ యజమానులు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి



నిర్వహణపైనా యజమానులు అంతే స్థాయిలో ద ృష్టి సారించాలని కలెక్టర్ చెప్పారు. తద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చు అన్నారు. ఈ దిశగా ప్రోటోకాల్ పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మైనింగ్ వ్యర్థాలను డంపు చేసేందుకు ప్రత్యేక స్థలాన్ని కూడా అధికార యంత్రాంగం గుర్తిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మైనింగ్ కార్మికుల ఆరోగ్యంపై యజమానులు కూడా ద ృష్టి సారించాలని ఆయన చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా అవసరమైన ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తుందన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం ప్రత్యేక ద ృష్టి సారించిందన్నారు. తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు



తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. భూముల ఆన్లైన్ ప్రక్రియలో నిబంధనల మేరకు పనిచేయాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు రెవెన్యూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించాల్సి ఉన్నందున ప్రజలు కూడా కొంత ఓపికతో ఉండాలని ఆయన సూచించారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలతో ప్రజల్లోనూ రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతున్న తీరుపై సానుకూల అభిప్రాయం పెరిగిందన్నారు. ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి



ఇబ్బంది కలగకుండా మైనింగ్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచేలా కార్యకలాపాలు ఉండాలన్నారు. డిఎంఎఫ్ నిధులతో ప్రజల అవసరాలు తీర్చడం పైనా దృష్టి పెట్టామన్నారు. మైన్స్ యజమానులకు అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం వైపు నుంచి అందించేలా ప్రతినెలా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తామన్నారు. పర్యావరణం, కార్మికుల ఆరోగ్యం వంటి విషయాలలో గనుల యజమానులు ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించరాదని ఆయన స్పష్టం చేశారు.

# జిల్లా పోలీసుల పనితీరుపై సమీక్ష





అరెస్ట్ చేయాలన్నారు. ప్రజా భద్రతను అత్యంత ప్రాధాన్యతగా భావించి, కేసులు తగ్గించుటకు మరింత చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కీలక కేసుల విచారణను వేగవంతం చేసి, నిందితులకు చట్టపరమైన శిక్షలు విధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పట్టణాలు, గ్రామాల్లో శాంతి భద్రతల కోసం నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. జిల్లాలో గంజాయి రవాణా, సరఫరా, నిల్వను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఐజీ గారు తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టి, పాత నేరస్థులు, రిపీటెడ్ అఫెండర్ల పై నిఘా ఉంచి, పెట్టి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ చెకింగ్, వాహన తనిఖీలు, బారికేడ్లు, రిఫ్లెక్టివ్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని, డ్రంకన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఐజీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌ను సందర్శించే బాధితులకు ధైర్యం, నమ్మకాన్ని కల్పించే విధంగా ప్రతి కేసును పోలీస్ అధికారులు, సిబ్బంది సున్నితంగా వ్యవహరించాలని ఐజీ సూచించారు. ఈ సమావేశంలో ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, దర్శి డిఎస్పీ లక్ష్మీనారాయణ, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సిఐలు హజరత్తయ్య, నాగరాజు, రామారావు, ప్రసాద్, రాజేష్ కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఘనంగా గెలక్సీ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం

ప్రమాణ స్వీకారం చేసారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన శిద్దా సుధీర్ కుమార్ మాట్లాడుతూ తన మీద నమ్మకం ఉంచి అధ్యక్షులుగా ఎన్నుకున్న గెలక్సీ గ్రానైట్ ఓనర్స్ పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతూ గెలక్సీ అసోసియేషన్ పెద్దల సహకారం తో అసోసియేషన్ అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రావిపూడి లక్ష్మి నారాయణ, కె సుబ్బారెడ్డి, సురేంద్ర రెడ్డి, శిద్దా హనుమంతరావు, ఎమ్ శివ రామ్, అనిల్, అజీమ్, చంద్రారెడ్డి, మైనింగ్ శాఖ అధికారులు డిడిఎమ్ జి రాజశేఖర్, ఏడిఎమ్ జి రామచంద్ర, ఏజి వర్మ, చీమకుర్తికి చెందిన గెలక్సీ క్వారీ ఓనర్స్ పాల్గొన్నారు. అనంతరం నూతన అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన శిద్దా సుదీర్ కుమార్‌ను పలువురు అభినందిస్తూ శాలువాతో సత్కరించారు.











# గత ఐదేళ్లు అభివృద్ధి ఏది

సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంపై కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఘాటుగా స్పందిస్తూ పార్టీ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. వైసీపీ చేస్తున్న ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే తప్ప ప్రజా ప్రయోజనాల కోసం కాదని విమర్శించారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ట్రిపుల్ ఐటీ, నిమ్జ్, నడికుడి రైల్వే మార్గం, ఓవీ రోడ్డు, మోడల్ స్కూల్ రోడ్డు, కనిగిరి బైపాస్ వంటి కీలక అభివృద్ధి అంశాల పై ఒక్క స్పందన చూపలేదని పేర్కొన్నారు. “అప్పట్లో ప్రజలు అడిగినా నోరు మెదపని వైసీపీ నేతలు ఇప్పుడు కోటి సంతకాల నాటకం చేయడం విడ్డూరం” అని ఎద్దేవా చేశారు. కనిగిరి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం పరిస్థితిని ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కూడా లేవు. ఒక్క ఆపరేషన్ చేసే పరిస్థితి లేదు. మహిళల ప్రసవాలు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే జరిగేవి. అప్పుడు కోటి సంతకాలు గుర్తుకురాలేదా ? అని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీల విషయంలో వైసీపీ చేస్తున్న ప్రచారం పూర్తిగా మాయమాటలేనని, మంజూరు చేసిన కాలేజీల కట్టడాలు ఇప్పటికీ గోడలు–స్లాబ్ దశ దాటలేదని గుర్తు చేశారు. పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే వైసీపీ దుష్ప్రచారమే చేయడంలో మునిగిపోయిందని అన్నారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయడంలో వైసీపీ విఫలమైందని, ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు చంద్రబాబు చర్యలు చేపట్టారని తెలిపారు.

ఇంటింటికి కులాయి పథకం పతాకం మాత్రమే అయిపోయిందని, అప్పుడు ఎందుకు సంతకాల సేకరణ చేపట్టలేదని వైసీపీని ఉగ్ర ప్రశ్నించారు. కనిగిరి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బైపాస్ రోడ్డు, ఓవీ రోడ్డు, మోడల్ స్కూల్ రోడ్డు, డయాలసిస్ సెంటర్ వంటి పలు పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గతంలో మంజూరు అయిన ట్రిపుల్ ఐటీ కళాశాలను పూర్తి చేసేందుకు మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ఇలాంటి మాయాజాలంతో మరోసారి వైసీపీ పార్టీకి ఓటమి తప్పదని ఎమ్మెల్యే ఉగ్ర హెచ్చరించారు. టిడిపి శ్రేణులు ప్రజలకు నిజాలు చేరవేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కనిగిరి మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, కొండ కృష్ణారెడ్డి, దొడ్డ, సుబ్బారెడ్డి, యువరాజ్ గయాజ్, ఎస్టిఆర్ ,ఉండేలా శ్రీనివాసరెడ్డి ,బజాజ్ ఓబుల్ రెడ్డి, అచ్చాల రవి, గుడిపాటి ఖాదర్, వెన్న శ్రీనివాస్ రెడ్డి గోనుగుంట పవన్ కుమార్ , తమ్మినేని సురేంద్రరెడ్డి ,కొల్లూరి శ్రీనివాసులు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రొయ్యల పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళల సంక్షేమానికి అనేక పథకాలు

సారించిందని కలెక్టర్ చెప్పారు. బాపట్ల జిల్లా తీర ప్రాంతంలో రొయ్యల పరిశ్రమలు అధికంగా ఉన్నందున వారి హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సమగ్ర సామాజిక భద్రత పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అవగాహనతోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇ–శ్రమ పోర్టల్, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్ ధన్, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకాల గురించి మహిళలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ డిడి గాలి దేముడు, ఏడీ కృష్ణ కిషోర్, డిప్యూటీ చీఫ్ ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ త్రినాధ్ రావు, సార్డ్స్ డైరెక్టర్ సునీల్ కుమార్, కార్మికశాఖ సహాయ అధికారి సాయి జ్యోతి, రవి ప్రదీప్, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో నిలవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్









(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 10)

పరిశుభ్రతలో బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో నిలవడానికి ప్రతి ఒక్కరు క ృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల ప్రచార ముగింపు కార్యక్రమం బుధవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. వ్యక్తిగత మరుగుదొడ్లు, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వారికి, క్లాప్ మిత్రలను జిల్లా కలెక్టర్ సన్మానం చేశారు. మీ వ్యక్తిగత మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకుంటే బాపట్ల జిల్లా పరిశుభ్రంగా ఉంటుందని కలెక్టర్ చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, సామాజిక మరుగుదొడ్లు, తీర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకుంటే పర్యాటకులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. తద్వారా ఆదాయ మార్గాలు పెరుగుతాయని, బాపట్ల జిల్లా తలసరి ఆదాయం మెరుగుపడుతుందని ఆయన వివరించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, సామాజిక మరుగుదొడ్లను శుభ్రం చేసే వారంతా పవిత్రమైన బాధ్యతను నిర్వహిస్తున్నారని అభినందించారు. మీ కుటుంబం బాగుండాలి, అలాగే సమాజం బాగుండాలనే ఉన్నతమైన ఆశయంతో ముందుకు వెళ్తున్నారని ప్రశంసించారు. పారిశుధ్య కార్మికుల కొరకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో బహిరంగ మలవిసర్జన నిషేధమన్నారు. ప్రజారోగ్యం ద ృష్ట్యా బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయరాదన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నవంబర్ 19 తేదీన నిర్వహించామని, అప్పటినుండి నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు చేపట్టిన ప్రచారాలు, అవగాహన కార్యక్రమాలు నేటితో ముగిసాయన్నారు. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఇల్లు నిర్మించుకుంటున్న వారంతా మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ప్రభుత్వమే మరుగుదొడ్లను మంజూరు చేస్తుందన్నారు. ప్రజలు పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపిడి శివన్నారాయణ, ఆర్డబ్ల్యూఎస్ డిఈ రాంబాబు, విజయ్ కుమార్, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నూతన సీఐని కలిసిన రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి మువ్వా రంగ సాయి యాదవ్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిసెంబర్ 10)

కనిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ ఉప్పు శ్రీనివాసులును బుధవారం ఆయన కార్యాలయంలో టిడిపి రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి, ఉమ్మన పల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు మువ్వా రంగ సాయి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# జీజీహెచ్‌లో పేషంట్ల సౌకర్యార్థం త్రీ సీటర్ చైర్స్ ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)

జిజిహెచ్‌లో కీలక డిపార్ట్మెంట్స్‌లో పేషంట్ల సౌకర్యార్థం త్రీ సీటర్ చైర్స్ ఏర్పాటు చేశామని, ఓబీజీ, ఐసీయు వేచి వుండే పేషంట్ల అటెండర్స్ కోసం వీటినీ ఉంచి నట్టు జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు తెలిపారు. ఇటీవల జిల్లా కలెక్టర్ రాజబాబుతో జరిగిన సమీక్షలో జిజిహెచ్‌లో కార్పొరేట్ సేవలు అందించాలని, పేషంట్ల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే చొరవతో ఇప్పటికే అనేక మంది దాతలు ముందుకు వచ్చి పలు వీల్ చైర్స్, ఫ్రీజర్ , స్ట్రెచర్లు అందచేశారన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు త్రీ సీటర్ చైర్స్ ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఏర్పాటు చేసిన 18 త్రీ సీటర్ లకు ఇవి అదనం అని అయన తెలిపారు. ప్రస్తుతం 18 త్రీ సీటర్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల జిజిహెచ్‌కు పేషంట్ల సంఖ్యా పెరిగింది అని, పేషంట్లతో పాటు వచ్చే వారి సంఖ్య కూడా పెరగడం కారణంగా అధికంగా ప్రజలు జిజిహెచ్‌కు వస్తున్నారన్నారు. అంతే కాకుండా ఆపరేషన్ థియేటర్, ఐసియూల వద్ద ఎక్కువ సంఖ్య పేషంటు తాలూకూ బంధువులు, అటెండర్స్ వేచి ఉండటాన్ని గమనంచి ఈ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిజిహెచ్‌లో పేషంట్ల మౌలిక సదుపాయాల కల్పన కోసం మరిన్ని చర్యలు తీసుకుంటున్నామని సూపరెంటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరెంటెండెంట్‌లు డాక్టర్ ఏడుకొండలరావు, డాక్టర్ తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం, బాపట్ల జిల్లా మూడు చక్రాల మోటార్ వాహనాలు కలిగిన అర్హులైన దివ్యాంగులకు పెట్రోల్ సబ్సిడీ మంజూరు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)

ప్రకాశం, బాపట్ల జిల్లాలో గల స్వయం ఉపాధి, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ రెట్రో ఫిట్టింగ మూడు చక్రాలు వాహనాలు కలిగి ఉన్న దివ్యాంగ అభ్యర్థులకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి పెట్రోల్ సబ్సిడీ మంజూరు చేశారు. కావున అర్హత కలిగి పెట్రోల్ సబ్సిడీ పొందుటకు ఆశక్తి కలిగిన దివ్యాంగ అభ్యర్థులు ప్రకాశం భవనంలోని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయం వారి నుండి దరఖాస్తులు పొంది పూరించిన ధరఖాస్తులను 17.12.2025 లోపు కార్యాలయంలో సమర్పించాలని ఆ శాఖ సహాయ సంచాలు జి అర్చన ఓ ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాలకు కార్యాలయం ఫోన్ నెం. 08592-281310 సంప్రదించాలని తెలియజేశారు.

# ఉప్పు చెరువు ప్రాంత నివాసులకు న్యాయం చేయాలి

### వారి నివాసాల వద్ద ఉన్న రోడ్డు నిర్మాణాలు చేపట్టాలి

### సిపిఐ డిమాండ్





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 10)

కందుకూరు పట్టణంలోని ఉప్పుచెరువు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల రోడ్డునుఆ ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని ఆ ప్రాంత ప్రజలకు రోడ్డు నిర్మాణాలు చేపట్టి వారికి కనీస వసతులను ఏర్పాటు చేయాలని సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు తెలిపారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉప్పు చెరువు ప్రాంత కాలనీవాసులతో కలిసి సబ్ కలెక్టర్ దామెర హిమ వంశీ కి వింత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పు చెరువు ప్రాంతంలో దాదాపు 20 సంవత్సరాల నుండి నివాసముంటున్న ప్రజలకు రోడ్డు మార్గం లేకుండా కొందరు ఆక్రమణ చేసి వారికి ఇబ్బందులు కలిగిస్తూ అడ్డుకున్న వారిపై ఆక్రమణదారులు దాడి చేసిన సంఘటన జరిగిందని, అది సరైన పద్ధతి కాదని ఆయన మండిపడ్డారు. ఇరిగేషన్ కు సంబంధించిన ఉప్పు చెరువు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకొని ప్రైవేటు వ్యక్తులు ఎలా వెంచర్లు వేస్తున్నారని, అక్రమంగా వెంచర్లు వేసి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్న వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. బహిరంగంగానే స్థలాలు ఆక్రమణలు జరుగుతుంటే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆయన మండిపడ్డారు. ధనవంతులకు ఒకలా పేదవారికి ఒకలా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. మున్సిపల్ అధికారులు సైతం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అన్ని ఆక్రమణలు ఎందుకు అడ్డుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఉప్పుచెరువు ప్రాంతంలో నివశిస్తున్న ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఆ ప్రాంత స్థానికులతో కలిసి సిపిఐ పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు యర్రంశెట్టి ఆనందమోహన్, చేవూరి దుర్గాప్రసాద్, ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాల బ్రహ్మాచారి కోటేశ్వరరావు ఉప్పు చెరువు ప్రాంత స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న ఆయిల్ ట్యాంకర్‌లు స్వాధీనం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)

ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్పీ కొల్లి శ్రీనివాసరావుకి వచ్చి సమాచారం మేరకు ఒంగోలు విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ సీఐలు రాఘవరావు, రవి బాబు, డిసిటిఓ రామారావు, ఎస్ఐ నాగేశ్వరావు, సివిల్ సప్లైస్ ఏఎస్‌వో పుల్లయ్య, సిబ్బంది ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో రూట్ చెక్ నిర్వహించి, చెన్నై నుండి వస్తున్న ఇండస్ట్రీలలో వినియోగం కోసం ఉపయోగించే ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్ కలిగిన రెండు ఆయిల్ ట్యాంకర్లను పట్టుకున్నారు. ఈ ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్‌ను గ్రానైట్ కంపెనీలు క్వారీలలో ఉపయోగించే వాహనాలకు అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ప్రభుత్వానికి కట్ట వలసిన జీఎస్టీలను సుమారు రూ.2.70 లక్షలు కట్టకుండా ఈ ట్యాంకర్ల ద్వారా అక్రమంగా ట్రాన్స్‌పోర్ట్ చేస్తున్నారన్నారు. ఈ తనిఖీలో చెన్నైకి చెందిన రాజమణి ఇండస్ట్రియల్ మిక్స్‌డ్ ఆయిల్‌కు (సుమారు 40 వేల లీటర్లు) చెన్నైలోనే ఇన్వాయిస్‌లు జారీ చేసి, ఆ సరుకును ఒంగోలులోని శ్రీనివాస లూబ్రికెంట్స్ పేరుతో రవాణా చేసినట్లు తేలిందన్నారు. శ్రీనివాస లూబ్రికెంట్స్ ఇండస్ట్రియల్ ఆయిల్‌ను లీటరు రూ.70 కు కొనుగోలు చేసి దానిని డీజిల్‌కు బదులు చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమలు, క్రషర్‌లకు చెందిన వాహనాలకు లీటరు రూ.87కు అక్రమ లాభం కోసం విక్రయించినట్లు కూడా నిర్ధారణ అయిందన్నారు. అదేవిధంగా తక్కువ పరిమాణానికి వే బిల్లు తీసి తద్వారా జీఎస్టీ ఎగవేత చేయుచున్నారని నిర్ధారణ చేశారు. మధ్యవర్తుల సమక్షంలో రెండు ఆయిల్ ట్యాంకర్లను స్వాధీనం చేసుకొని, అడల్టరేషన్ నిర్ధారణ కోసం నమూనాలు సేకరించడం జరిగిందన్నారు. రవాణా చేసిన వారు ఏల్చూరి శ్రీనివాసరావు, శ్రీనివాస ల్యూబ్స్ ,ఆయిల్ ప్రోడక్ట్స్, ఒంగోలు. ఎర్లా నారాయణ, చీమకుర్తి, రాజమణి, దివ్య ఇండస్ట్రీస్, తిరుమన్నమల్లై, చెన్నై. అదనంగా సెక్షన్ 6(ఏ) ప్రకారం ఒంగోలు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు దాఖలు చేస్తున్నామన్నారు. పన్ను ఎగవేతపై చర్యలు తీసుకునేందుకు కమర్షియల్ టాక్స్ శాఖకు సిఫారసు చేశామన్నారు. శాంపిల్స్ విశ్లేషణా నివేదిక అందిన తరువాత క్రిమినల్ చర్యలకు రికమెండ్ చేయడం జరుగుతుందన్నారు.

# గురుకుల బాలుర విద్యాలయం తనిఖీ







(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 10)

చీమకుర్తిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల బాలుర విద్యాలయాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి, విద్యాలయంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కొంత సేపు ముచ్చటిస్తూ, సిలబస్ ఎంతవరకు అయింది, ఉపాధ్యాయులు బోధన సక్రమంగా చెపుతున్నారా, స్టడీ మెటీరియల్ ఇచ్చారా, వందరోజుల ప్రాక్టీస్ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. స్టడీ మెటీరియల్ ఇచ్చారని, సిలబస్ పూర్తి అయిందని విద్యార్థులు జిల్లా కలెక్టర్ కు తెలపడం జరిగింది. బోధనా సిబ్బంది విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేసి, ఉతీర్ణతా శాతం పెంచేలా చూడాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, టాయిలెట్లు పూర్తి పరిశుభ్రతతో ఉండాలన్నారు. అనంతరం విద్యాలయంలో టాయిలెట్లను పరిశీలించారు. మరమ్మత్తులకు గురైన టాయిలెట్లకు వెంటనే మరమ్మత్తులు చేయించాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిటిడబ్ల్యూటీయా వరలక్ష్మి, స్థానికి రెవెన్యూ, విద్యాశాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శోభాయమానంగా శ్రీ అయ్యప్పస్వామి నగరోత్సవం



**శ్రీ అయ్యప్పస్వామి నగరోత్సవంలో పాల్గొన్న**
**మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా కుటుంబ సభ్యులు**
**పెద్ద సంఖ్యలో పాల్గొన్న సర్వ దీక్షా స్వాములు, భక్తులు**
**జ్యోతి ప్రదర్శనలో చిన్నారి భక్తులు**
**అయ్యప్ప స్వామి శరణు ఘోషతో నగరోత్సవం**





**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 10)**

బుధవారం ఉదయం శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ హరిహర సుత అయ్యప్పస్వామి విశేష పూజల అత్యంత వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి వారికి మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు, శిద్దా పాండురంగరావు, శిద్దా సుధాకర్ తమ కుటుంబ సభ్యులతో కలసి మహా గణపతి పూజ,గంగ పూజ, మండపారాధన మహన్యాసక పఠనం, ఆదిత్యాధి నవగ్రహ పూజ అనంతరం అయ్యప్పస్వామి వారికి సర్వ దీక్ష స్వాములు గోపాల గురు స్వాములతో కలసి, పంచామృత, ఫలరసాల, బస్మ, గంధ, పన్నీరు అభిషేకాలు నిర్వహించి స్వామి వారికి విశేష పూజలు, అష్టోత్తరపూజలు, అలంకరణ వైభవంగా నిర్వహించారు. అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు కుటుంబ సభ్యులతో శ్రీ అయ్యప్పస్వామి వారిని మంగళ వాయిద్యాల వేద మంత్రాలతో స్వామి వారిని అంతరాలయానికి చేర్చి విశేష పూజలు నిర్వహించి మహా హారతులు సమర్పించారు. శ్రీ హరిహర క్షేత్రంలో అభిషేకాలు సందర్భంగా సకల దీక్షా స్వాముల అయ్యప్ప శరణు ఘోషలతో హరిహర క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నేలకొంది. వేద పండితులు నేలబోట్ల రామకృష్ణ శాస్త్రి, అల్లూరి మనోజ్ఞ శర్మ బృందం ఆధ్వర్యంలో పూజా క్రతువు నిర్వహించారు. శిద్దా వెంకటేశ్వర్లు వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు, సర్వ దీక్ష స్వాములకు బిక్ష ఏర్పాటు చేసారు.

**అట్టహాసంగా అయ్యప్పస్వామి నగరోత్సవం**

మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్పస్వామి నగరోత్సవం వీనులవిందుగా, కమనీయంగా సాగింది. ఈ సందర్భంగా శ్రీ అయ్యప్పస్వామి నగరోత్సవం పునస్కరించుకొని ఊరేగింపు రథాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు, విశేష పూలు, విద్యుత్ దీపాలతో స్వామి వారి రథం సర్వాంగ సుందరంగా అలంకరించారు. శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ దంపతులు, శిద్దా సుధాకర్, శిద్దా కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించి నగరోత్సవం లాంఛనంగా ప్రారంభించారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులతో జ్యోతి ప్రదర్శన నగరోత్సవానికి ప్రత్యేక శోభను తెచ్చింది. సర్వ దీక్షా స్వాములు, గురు స్వాములు నగరోత్సవంలో పాల్గొని శ్రీ అయ్యప్పస్వామి భజనలు,కీర్తనలను భక్తిపారవశ్యం ఆలపించారు. మంగళ వాయిద్యాలు, కీర్తనలతో శ్రీ అయ్యప్పస్వామి నగరోత్సవం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో జరిగింది. చీమకుర్తి ప్రధాన రహదారి వెంట మహిళలు శ్రీ అయ్యప్పస్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి అయ్యప్పస్వామి హారతులు అందుకొన్నారు. అయ్యప్పస్వామి నగరోత్సవంలో సర్వ దీక్షా స్వాములు, మహిళా భక్తులు,చీమకుర్తి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. శ్రీ అయ్యప్పస్వామి నగరోత్సవం మాజీమంత్రి శిద్దా రాఘవరావు నివాసం వరకు సాగింది. అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు కుటుంబ సభ్యులతో కలసి జ్యోతి ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు, భక్తులకు, స్వాములకు ప్రత్యేక ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో శిద్దా కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, చీమకుర్తి పరిసర ప్రాంతాలను చెందిన సర్వ దీక్షా స్వాములు, వాసవి మహిళలు, చీమకుర్తి కి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ, హరి వెంకట కుమరా చార్యులు, హరికృష్ణ శర్మ, కృష్ణ శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించిన పోలీసులు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)**

జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా బుధవారం ఒంగోలు ట్రాఫిక్ సీఐ జగదీష్, మాల్యాద్రి, కోటయ్య వారి సిబ్బందితో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు సిద్ధమయ్యారు. నగరంలోని





కర్నూల్ రోడ్ ఫ్లై ఓవర్ దగ్గర నుండి వర్మ గ్రాండ్ వరకు, మస్తాన్ దర్గా నుండి కొత్తపట్నం బస్టాండ్ వరకు రోడ్ క్లియరింగ్‌లో భాగంగా రహదారిని ఆక్రమించి అడ్డంగా పెట్టిన తోపుడు బండ్లు, వ్యాపార సంబంధ ప్రదర్శన బోర్డులను, ఇతర ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులను నివారించారు. వారి పై బీఎన్ఎస్ యాక్ట్ క్రింద పెట్టీ కేసులు నమోదు చేశారు. ఇంకోసారి అడ్డంగా పెట్టిన యెడల చట్ట పరంగా కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

## అధికారులను కలిసిన బీజేపీ నేతలు







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 10)**

భారతీయ జనతా పార్టీ ఉలవపాడు మండల కన్వీనర్ జిటి రాము మండల ఎమ్మార్వో, ఎండిఓ, ఎస్ఐలను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. వారితో పరిచయం చేసుకోవడం జరిగింది. కన్వీనర్‌తో పాటు సీనియర్ నాయకులు పొందూరు కృషారెడ్డి, ఎలమంద, బెల్లంకొండ శ్రీధర్, శేషగిరిరావులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలకు మండల కన్వీనర్ ధన్యవాదాలు తెలిపారు.

# ఫీల్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26వేలు

## ఉద్యోగ భద్రత కల్పించాలి

### వై పాలెం ఫీల్డ్ అసిస్టెంట్లు



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, డిసెంబర్ 10)**

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యర్రగొండపాలెం మండల కార్యాలయం దగ్గర ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి ఎంపీడీఓ బి. శ్రీనివాసులు వినతి పత్రం ఇచ్చారు అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో గత 19 సంవత్సరముల నుండి ఫీల్డ్ అసిస్టెంట్లగా విధులు నిర్వహిస్తున్న ఫీల్అసిస్టెంట్లు ఉపాధికూలీలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ గ్రామపంచాయతీ స్థాయిలో సుస్థిర, శాశ్వత వనరులు ఏర్పాటు గ్రామాల అభివ ృద్ధికి తోడ్పడుతున్నాము. ఉపాధి హామీ పథకము దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ను మొదటి స్థానంలో నిలబెట్టటంలో ఫీల్డ్ అసిస్టెంట్ల క ృషి కీలకమైనది. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇస్తున్న వేతనం నెలకి రూ.5745లతో కుటుంబాలు బ్రతకడం కనకష్టంగా మారింది. మా కుటుంబాలను పస్తుల నుండి కాపాడేందుకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ సమస్యలు తీరతాయని ఫీల్డ్ అసిస్టెంట్లు భావించారు. కాని గత ప్రభుత్వంలో జరిగినట్లుగానే గత ఏడాది కాలంలో ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమ తొలగింపులు పెద్ద ఎత్తున జరిగాయి. ఇలాంటి ఒత్తిడిల వలన ఫీల్డ్ అసిస్టెంట్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు, హత్యలకు గురి అవుతున్నారు. అనేక చోట్ల బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నారు. దీనితో ఫీల్డ్ అసిస్టెంట్లు నిత్యం అ భద్రతతో బ్రతుకుస్తున్నాము కావున ఫీల్డ్ అసిస్టెంట్ లపై రాజకీయ వేదింపులు అరికట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని మనవి చేస్తున్నాము. ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న ఈ క్రింది పేర్కొన్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేసి మా కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నాము. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వ్రాతపూర్వక తెలియజేశామన్నారు. మాన్డేస్ విధానం రద్దు చేయాలి, మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలి.ఎన్ఎంఎంఎస్ యాప్ నందు కూలీల హాజరు, హెడ్కౌంటింగ్ అప్లోడ్ సర్వర్ లోపాలను సకాలంలో సరిదిద్దాలి. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించకుండా ఉద్యోగ భద్రత కల్పించాలి. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు అంగవైకల్యం, మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో 25 లక్షలు కల్పించాలి. కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలి. ప్రక్క గ్రామాలలో చేయించిన పనిదినాలను వర్క్ చేయించిన ఎఫ్ఎలకు కలపాలి. ఎన్ఎంఎంఎస్ భువన్ ఇతర యాప్లు, 5 జీబి నెట్ వర్క్ యాప్ వాడుతున్న సందరరేగా కొత్త మొబైల్స్, 5 జిబి సిమ్ కార్డు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇవ్వాలి. కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలనే డిమాండ్లను వారు తెలియజేశారు.

# మార్కాపురం జిల్లా ఏర్పాటుతో మన బిడ్డల భవిష్యత్ బంగారు మయం

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 8)**

మార్కాపురం జిల్లా ఏర్పాటుతో మన బిడ్డల భవిష్యత్ బంగారుమయం అవుతుందని టీడీపీ నేతలు తెలిపారు. బుధవారం మండలంలోని మూగచింతల గ్రామంలో మార్కాపురం జిల్లాను ప్రకటించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాను ప్రకటించి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, పొదిలి పట్టణ అద్యక్షులు ముల్లా ఖుద్దూస్, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, పొదిలి పట్టణ తెలుగుయువత అద్యక్షులు షేక్ కాలేషా, తానికొండ వెంకట్రావు, రాజు, మూగచింతల గ్రామ నాయకులు బండారు బలరాం, కిలారి రాంబాబు, తెలుగు యువత నాయకులు గుమ్మళ్ళ సుబ్బారావు, బండారు శ్రీను, బత్తినేని హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.







# నియోజకవర్గంలో సంతకాలు సేకరణ విజయవంతం



**పార్టీలకతీతంగా నియోజకవర్గంలో**
**ప్రతి గ్రామం నుండి స్వచ్ఛందంగా సంతకాలు చేశారు**
**పేదల వైద్య, విద్య ప్రైవేటీకరణ జరగకుండా అడ్డుకుంటాం**
**అభివృద్ధి పనులను వైసీపీ స్వాగతిస్తుంది**
**అదే సందర్భంలో అవినీతి జరిగితే నిలదీస్తాం**
**విలేకరుల సమావేశంలో**
**మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 10)**

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటికరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా కందుకూరు నియోజకవర్గం లోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ పత్రాలను పార్టీ జిల్లా కార్యాలయంకి ర్యాలీగా తరలించారు. కార్యక్రమానికి భారీగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ జండా ఊపి సంతకాలు సేకరణ పత్రాలు తరలించే వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా గత రెండు నెలలగా మండలాలు ,గ్రామాలు, మున్సిపాలిటీ లోని వివిధ వార్డులో సంతకాలు సేకరించడం జరిగిందన్నారు. సంతకాల సేకరణలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడంపై ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ప్రైవేటీకరణ జరగకుండా ప్రభుత్వంపై వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి తీసుకొస్తుంది అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి అంకితభావంతో 17 మెడికల్ కాలేజీ లను నిర్మించ పూనుకుంటే చంద్రబాబు నాయుడు పేద ప్రజల వైద్య విద్యను ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నాడని, కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ జరగనివ్వం అని అన్నారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రజలందరూ పార్టీలకతీతంగా కదిలి వచ్చి స్వచ్ఛందంగా సంతకాలు చేశారని అన్నారు.



సంతకాలు చేసిన నియోజకవర్గ ప్రజలందరికీ, సంతకాల సేకరణకు సహకరించిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రజా ఉద్యమం ఇంతటితో ఆగదని ప్రైవేటీకరణ ఆగే వరకు పార్టీ ఇచ్చే ప్రతి పోరాటంలో కందుకూరు నియోజకవర్గం వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నిలబడుతుందని అన్నారు. ఈరోజు నెల్లూరు జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి కి అందిస్తామని 15వ తారీఖున తాడేపల్లి సెంట్రల్ పార్టీ కార్యాలయం కు తరలిస్తామని, 17వ తారీఖున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి గవర్నర్‌ను కలిసి కోటి సంతకాలు ప్రతులను అందిస్తారని తెలిపారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని అన్నారు అభివృద్ధి పేరుతో నాసిరకం పనులు చేస్తూ ప్రజాధనాన్ని వృధా చేస్తే చూస్తూ ఊరుకోమని రోడ్డు మీదకు వచ్చి నిలదీస్తామని తెలిపారు. కరేడు ప్రాంతంలో వేసిన నాసిరకం రోడ్లు నాలుగు రోజులకే కొట్టుకుపోవడం అవినీతికి పరాకాష్ట అదేవిధంగా పట్నంలో జరుగుతున్న డివైడర్ పనులు నాణ్యతగా చేయకపోతే ప్రజల పక్షాన నిలదీస్తామని అన్నారు. చేవూరు రావూరు ప్రాంతంలో ఇండో సోలార్ కి ఇచ్చిన భూములను బలవంతాన బిపిసిఎల్ కు కట్టబెట్టడం సరైనది కాదన్నారు. విండో సోలార్ ఎప్పటికీ రైతులకి డబ్బులు చెల్లించిందని పొల్యూషన్ లేని ప్రాజెక్టు నిర్మిస్తామని గ్రామాన్ని అభివృద్ధి చేసి వారికి విశాలమైన రోడ్లు ఆధునికమైన పార్కులు, వసతులతో కూడుకున్న హాస్పిటల్, పాఠశాల, కళాశాల నిర్మించి ఇస్తామని హ్యాపీ పర్సెంట్ సబ్సిడీతో కరెంటు ఇస్తామని ఇండో సోలార్ వాగ్దానం చేసింది. దీనిని కాదని కాలుష్య రహితమైన బీపీసీఎల్‌కి భూములు తీసుకోవడం వల్ల ఆ ప్రాంతాల్లో భూగర్భ జలాలు దెబ్బతింటాయని, రైతుల పంట పొలాలు నాశనమై ఎలర్జీలతో చర్మవ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయి. బిపిసిఎల్ కు భూములు తీసుకునే సందర్భంలో భూములు కోల్పోతున్న ప్రతి రైతు అభిప్రాయాన్ని వ్యక్తిగతంగా తెలుసుకోవాలని అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగాలు ఇవ్వకుండా తాత్సారం చేయటం సరైనది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు మండలం అధ్యక్షులు ఈదర రమేష్, వలేటివారిపాలెం మండలం అధ్యక్షుడు అనుమోలు లక్ష్మీనరసింహం, లింగసముద్రం మండలం అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్లు, ఉలవపాడు మండలం అధ్యక్షులు నన్నం పోతురాజు, రాష్ట్ర బూత కమిటీ కార్యదర్శి గణేశం గంగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ సమావేశం

**కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవకుమార్**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)**

ఈ నెల 12న ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ మీటింగ్ జరుగుతున్నది ఈ ఎన్ఎస్ఎస్ మీటింగుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ మద్దినేని సుధాకర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ను ఉద్దేశించి మాట్లాడుతారు స్పెషల్ క్యాంపు విధివిధానాలు రెగ్యులర్ ప్రోగ్రామ్స్ గురించి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్‌కి దిశ నిర్దేశం చేసి ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలతో కమ్యూనిటీని ఏవిధంగా భాగస్వామ్యం చేయాలి, గ్రామీణ అభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ పాత్ర అలాగే అర్బన్ ఏరియాలో చెట్ల పెంపకం పారిశుద్ధ్యం, వయోజన విద్య బాల్యవివాహాలు హెచ్ఐవి అవేర్నెస్ క్యాన్సర్ అవేర్నెస్ ప్రోగ్రాం , ఆల్కహాల్ డ్రగ్స్ నివారణ చర్యలును ఏ విధంగా నివారించాలి, నిషేధించాలి అని ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఏ విధంగా భాగస్వామ్యం చేయాలి అనే అంశాలపై మాట్లాడుతారు ఈ యొక్క కార్యక్రమానికి ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి రిజిస్టర్ బి హరిబాబు యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలమని యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవకుమార్ పాల్గొంటారు ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ అనుబంధ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ విధిగా హాజరై జయప్రదం చేయవలసినదిగా మనవి. ఆహ్వాన పత్రాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతికి అందిస్తున్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేలా చర్యలు

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**



**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 10)**

ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. జల సురక్ష కార్యక్రమంలో భాగంగా చీమకుర్తిలో గల తాగునీటి సరఫరా యూనిట్‌ను సందర్శించి ఫిల్టర్ బెడ్‌ను, నీటి సరఫరా విధానాన్ని, తాగునీటి సాంద్రతను పరిశీలించి, నీటిని ఎప్పుడు టెస్ట్ చేసారు, ఎప్పుడు క్లోరినేషన్ చేసారు, ఎప్పుడు ట్యాంక్ ను క్లీన్ చేసారు తదితర వివరాలను కలెక్టర్ గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను అడిగితెలుసుకున్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాల్సిన భాధ్యత అధికారుల పై ఉందన్నారు. అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం పాటిమీదపాలెం గ్రామాన్ని సందర్శించి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ సక్రమంగా తాగునీరు వస్తున్నదా అని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వెలుగు చూస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధి పై వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారా అని జిల్లా కలెక్టర్, గ్రామస్తులను అడగగా, వైద్య సిబ్బంది స్క్రబ్ టైఫస్ వ్యాధి గురించి తెలపడం జరిగిందని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు తెల్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకమేమీ కాదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జ్వరం, ఇతర అనుమానిత లక్షణాలు ఏమైనా ఉంటే తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే నయం అవుతుందన్నారు. నిర్లక్ష్యం చేయవద్దని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.









# త్వరలోనే మార్కాపురంకు నూతన మిర్చి యార్డు తీసుకువస్తా

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 10)**







త్వరలోనే మార్కాపురంకు నూతన మిర్చి యార్డు తీసుకువస్తానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం జిల్లాను ప్రకటించడం పట్ల మార్కాపురం పురపాలక సంఘంలోని 13వ వార్డ్‌లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రజల నుద్దేశించి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా కాలంలో పశ్చిమ ప్రాంతానికి వరగబెట్టిందేమీ లేదన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన వైకాపా పూర్తి చేయకుండానే అంకితం చేశామంటూ మోసం చేశారన్నారు. వైకాపా హయాంలో 29 ప్రభుత్వ పథకాలకు జగన్ పేరు పెట్టి అమలు చేశారని, అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రాంత వెనుకబాటును గుర్తించి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రన్న పేరును మార్కాపురం జిల్లాకు పెడితే తప్పేంటని ప్రశ్నించారు. జీవించి ఉన్న జగన్ పేరు పెట్టినప్పుడు, చంద్రన్న పేరుకు అభ్యంతరం ఏంటని విమర్శించారు. మార్కాపురం జిల్లా ప్రకటనతో పశ్చిమ ప్రాంతంలో ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు అన్నారు. టిడిపి తీసుకున్న నిర్ణయాన్ని ఓరవలేకనే విమర్శలు చేస్తున్నారన్నారు. త్వరలోనే చంద్రన్న మార్కాపురం జిల్లాను అభివృద్ధి పదంలో నడుపుతామన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రకాశం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.వైకాపా హయాములో రాష్ట్రము దివాలా తీసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుంద అన్నారు. ఓట్లు దండుకొని వైకాపా ప్రభుత్వం మార్కాపురం జిల్లా ఇవ్వకుండా వివక్షత చూపిందని, ఎన్నికలు ఇచ్చిన వాగ్దాన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు మార్కాపురం జిల్లాను ప్రకటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా చంద్రబాబు నిలిచిపోయారన్నారు. దోచుకోవడం దాచుకోవడం మినహా రాష్ట్ర అభివృద్ధి కోసం వైకాపా చేసింది శూన్యమన్నారు. వెలుగొండ ప్రాజెక్టును కూడా త్వరలో పూర్తిచేసి పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేరుస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. చెప్పిన మాటకు కట్టుబడి నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. తన హయాంలో జిల్లా రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రజా మద్దతుతో పశ్చిమ ప్రాంత అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు ప్రతి కార్యకర్తకు తోడుగా నిలుస్తానని, పేద ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తానని స్పష్టం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి పూల వర్షంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి వార్డు ప్రజలు పూలమాల వేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాదిక్, తెలుగుదేశం నాయకులు, ఎన్డీఏ కూటమి నాయకులు, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే కందుల







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 10)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌ను బుధవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల అన్నా క్యాంటీన్‌ను ఆయన పరిశీలించి క్యాంటీన్లో వారికి అన్నాన్ని వడ్డించారు. భోజనం చేసేవారిని అడిగి భోజనం రుచిగా ఉందా లేదా అనే విషయాన్ని తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకట్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీం ఖాన్, కార్యదర్శి రంగస్వామి గౌడ్, తదితరులు ఉన్నారు. అనంతరం క్యాంటీన్ సిబ్బందితో కలిసి ఫోటోకు ఫోజులు ఇచ్చారు.

## విద్యార్థులు మంచి ప్రతిభను కనబరచాలి







(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 10)

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జి రాజేంద్ర బాబు ఆధ్వర్యంలో కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి నాయకుడు మండవ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాసి మంచి ప్రతిభను కనబరచాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్ర బాబు మాట్లాడుతూ కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మండవ మురళీమోహన్, పల్లపోతు రమేష్ బాబు, ఎంఈఓ రవిచంద్రబాబు, ప్రధానోపాధ్యాయుడు వై వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ చేయి... చేయి.. కలుపుదాం...

**రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం అనే నినాదంతో**
**ముందుకు సాగుతున్న ప్రకాశం జిల్లా పోలీసు సిబ్బంది**
**రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ఫోకస్ పెట్టిన ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)

ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అన్ని జాతీయ, రాష్ట్ర రహదారులు 534.7 కిలోమీటర్ల దూరం వరకు కొనసాగుతుంది. ఈ మధ్య కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరగడంతో వాటిని నివారించేందుకు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ప్రత్యేకించి కొత్తగా రోడ్డు సేఫ్టీ వారియర్స్ టీంలను ఎర్పాటు చేయడం జరిగింది. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ టీమ్‌లను ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఎర్పాటు చేశారు. ఈ టీంలో సభ్యులు గా పోలీస్ సిబ్బంది, నేషనల్ హైవే సిబ్బంది, నేషనల్ హైవే కు అనుకుని ఉన్న గ్రామస్థులతోపాటు వివిధ రకాలుగా సమాజ సేవ చేస్తున్న సోషల్ వర్కర్లు, మొదలగువారి ఉంటారు. ఈ టీం సభ్యులు ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తారు. మొదటగా 534.7 కిలోమీటర్ల రహదారిలో ఎక్కువ ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించడం జరుగుతుంది. ప్రమాదాలు ఎక్కువగా ఉదయం, సాయంత్రం, రాత్రి ఏ సమయాల్లో జరుగుతున్నాయో కూడా విశ్లేషిస్తారు. ఇటీవలి కాలంలో గ్రామాల నుండి నేషనల్ హైవేకు కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో అటు, ఇటు చూడకుండా వేగంగా వస్తున్న ద్విచక్రవాహనాలు, కార్లు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రయాణికులు వెళ్లే ద ృష్ట్యా, ఎస్పీ గారు ఏర్పాటు చేసిన రోడ్డు సేఫ్టీ వారియర్స్ టీమ్‌లు అక్కడ వాహనాల వేగాన్ని తగ్గించే చర్యలు తీసుకుంటున్నారు. దీని ద్వారా గణనీయంగా ప్రమాదాలను తగ్గించవచ్చు. బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి అక్కడ స్థానిక పోలీస్ స్టేషను నుండి సిబ్బందితో పాటు బ్యారిగేట్లు ఎర్పాటు చేయడం జరుగుతుంది. జాతీయ రహదారి పై వెళ్ళుతున్న వాహన చోదకులు వాహనాల లైటింగ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకోవాలి. లారీలు, బస్సులు యజమానులు వాహనం వెనుకభాగం లో ఎట్టిపరిస్థతులలో రేడియం స్టిక్కర్లు అతికించుకొవాలి. శీతాకాలంలో పొగమంచు అధికంగా ఉండటం వల్ల, లారీ, బస్సులు, కారు, ద్విచక్ర వాహన చోదకులు వాహనాన్ని రోడ్డు పక్కన ఖాళీగా ఉన్న స్థలాలలో మాత్రమే పార్కింగ్ చేయాలి. జాతీయ, రాష్ట్ర రహదారుల అంచున వాహనాలు నిలిపివేయడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అందువల్ల నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలిపివేయాలని సూచిస్తున్నారు. పోలీసు నిబంధనలు ఉల్లంఘించే వారిపై మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారు. ప్రజలంతా కలిసికట్టుగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను సులభంగా నివారించవచ్చని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## వ్యవసాయ రంగాల్లో ఉత్పాదకత పెరగాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 10)

వ్యవసాయ రంగాల్లో ఉత్పాదకత పెరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రాథమిక సెక్టార్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం స్థానిక కలెక్టరేట్ లో సమావేశం నిర్వహించారు. జనాభా పెరుగుదలకు తగినట్టుగా వ్యవసాయ ఉత్పత్తులు అధికం కావాలని కలెక్టర్ చెప్పారు. ప్రజల తలసరి ఆదాయం పెరగాలంటే అన్ని పంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. 41 అంశాలలో పురోగతి సాధించాలని అధికారులకు ఆయన మార్గ నిర్దేశం చేశారు. ప్రభుత్వం నిబంధనలు, ప్రామాణికలను పాటించాలని సూచించారు. ఉద్యాన పంటల సాగు లక్ష్యం 500 హెక్టార్లు ఉండగా, 60 శాతం విస్తరణ జరగక పోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. ఉద్యాన పంటలు విస్తీర?ం లక్ష్యం మేరకు నూరు శాతం సాధించాలన్నారు. ముఖ్యంగా చిరుధాన్యాల ఉత్పత్తులు మరింత పెరగాలన్నారు. మినుము, చెరుకు, పత్తి పంటల విస్తీర్ణం పెంచాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవడానికి గ్రామాలలో ఏర్పాటు చేసిన కమిటీలు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. వ్యవసాయానికి 12 అంశాలు, ఉద్యాన వన పంటలకు 51 అంశాలు, పట్టు సాగులో ఆరు అంశాలు, పశు సంవర్ధక శాఖకు 17 అంశాలు, మత్స్య శాఖకు 9 అంశాలు, మార్కెటింగ్ శాఖలో మూడు అంశాల ప్రామాణిక లక్ష్యాలను చేరుకోవాలన్నారు. శనగ పంట విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతు సేవ కేంద్రాలలో అన్ని రకాల సేవలు రైతులకు అందించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. అలాగే పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ షాలేమురాజు, వ్యవసాయ శాఖ డిడి అన్నపూర?, మార్కెటింగ్ శాఖ రాంబాబు, మార్క్ ఫెడ్ జిఎం కరుణశ్రీ, పశుసంవర్ధక శాఖ జెడి వేణుగోపాల్, మత్స్యశాఖ డీడీ గాలి దేముడు, పౌరసరఫరాల సంస్థ డిఎం శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

**మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతంగాన్ని ఆదుకోవాలి**
**సిపిఐ మండల కార్యదర్శి జీపీ రామారావు**



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 10)

రైతులు పండించిన వరి మొక్కజొన్న పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, మొంతా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ, రైతు సంఘం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కనిగిరి తహసీల్దార్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులకు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా కనిగిరిలో స్థానిక తహసీల్దార్ కి వినతిపత్రం ఇ వ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి షేక్ గులాం హుస్సేన్, ఏఐటీయూసీ నాయకులు షేక్ ఖాసింపీరా, మహిళా సమాఖ్య నాయకులు షేక్ బషీరా, ఏఐయస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ పవన్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం భోజనం పథకం మెనూను కచ్చితంగా అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 10)

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మధ్యాహ్నం భోజనం పథకం మెనూను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. చీమకుర్తిలోని ప్రభుత్వ ఉన్నత ఆకస్మికంగా సందర్శించి, మధ్యాహ్నం భోజనం నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందరరేగా విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహ పంక్తి భోజనం చేశారు. మధ్యాహ్నం భోజనం అమలు పై కలెక్టర్ సంత ృప్తిని వ్యక్తం చేస్తూ, ప్రతిరోజు ఇలాగే ఉంటుందా, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, భోజనం ఎలా వుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగా వుందని విద్యార్థులు జిల్లా కలెక్టర్ కు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మధ్యాహ్నం భోజనం పథకం మెనూను కచితంగా అమలు చేయాలని, నాణ్యతతో భోజనం విద్యార్థులకు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.









On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# మొంథా తుఫాను సమయంలో సేవలందించిన సానిటరీ వర్కర్స్, ఇంజనీరింగ్ వర్కర్స్, సచివాలయ సిబ్బందికి చిరు సత్కారం చేసిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 10)**

మొంథా తుపాను సమయములో ఒంగోలు నగరపాలక సంస్థ తరపున విశేష సేవలు అందించిన సుమారు 230 మంది కి ( శానిటరీ వర్కర్స్ 100 మంది, ఇంజనీరింగ్ వర్కర్స్ 33 మంది, సచివాలయ సిబ్బంది 82 మంది, ఆఫీస్ సిబ్బంది 25 మందికి) బుధవారం నగరంలోని బాలాజీ తిరుపతిరావు కల్యాణమండపం నందు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు చిరు సత్కార సభ చేయటం జరిగింది. ఈ సభకి ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ అధ్యక్షులుగా వ్యవహరించటం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మెంథా తుఫాను సమయంలో నగరపాలక సంస్థ సిబ్బంది ముఖ్యంగా శానిటరీ వర్కర్స్, సచివాలయ సిబ్బంది లింగ భేదం లేకుండా ప్రతిఒక్కరు వారి కుటుంబాలని సైతం లెక్కచేయకుండా విపత్కర పారితోషికంలో అందించిన సేవలు ఎంత చెప్పినా తక్కువ కనుక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆదేశాల మేరకు వారికి చిరుసత్కారంతో పాటు ప్రశంస పత్రం , నగరపలక సంస్థ తరుపున విశేష సేవ అందించిన 150 మంది వర్కర్స్‌కి నిత్యావసర వస్తువలను ఎమ్మెల్యే అందించటం జరిగుతుంది అని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా అదే నిబద్ధత పని చేసి మన ఒంగోలు నగరంని క్లీన్ ఒంగోలు గ్రీన్ ఒంగోలు నగరం గా రూపొందించాలి అని పిలుపునిచ్చారు. ఆ తరువాత ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ, మంత తుఫాను సమయంలో మీరు చేసిన పనుల వల్లే నాకు కానీ, కమీషనర్‌కి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవటం జరిగిందని తెలిపారు. వర్కర్స్ యొక్క వెలేఁరే కోసం ఇక మీదట ప్రతి మూడు నెలలకు ఒకసారి హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయటం జరుగుతుంది అని తెలిపారు. అలానే రాబోయే జనవరి నుంచి ప్రతి మూడు నెలలకు వర్కర్స్ యొక్క పనితీరు రివ్యూ చేసి ప్రతి శానిటరీ డివిజన్ నుంచి 2 శానిటరీ వర్కర్లకు ఒక నెల జీతం బోనస్ కూడా ఇవ్వటం జరుగుతోంది అని తెలిపారు. అలానే జనవరి చివరి నాటికి నగరపాలక సంస్థ లో పని చేసే పరారీ శానిటరీ వర్కర్స్ కి ఐడెంటిటీ కార్డ్ అందచేస్తాము అని, వారు వారి అనారోగ్య కారణాలతో ఏది అయినా హాస్పిటల్ లో చూపించినప్పుడు వారికి కొంతమేర డిస్కౌంట్ ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు అని తెలిపారు. ప్రతి వర్కర్ కూడా వారి ఆరోగ్యం పట్ల జాగ్రత వహించాలి అని సూచించారు. శానిటరీ వర్కర్స్ పనిచేస్తున్నప్పుడు వారికి గ్లోవ్స్, బూట్లు ఇవ్వమని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. ఈ సమావేశం లో ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ కె వెంకటేశ్వరరావుతో పాటు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఉడా చైర్మన్ షేక్ రియాజ్ , నగర మేయర్ గంగాడ సుజాత , అసిస్టెంట్ కమీషనర్ రాంభూపాల్ రెడ్డి , డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి , కార్పొరేటర్లు తిప్పరపల్లి రవితేజ, అంబూరి శ్రీనివాస్, చింతపల్లి గోపి, శేషయ్య, పసుపులేటి శ్రీనివాస రావు, నరసయ్య, అంబటి ప్రసాద్, చంద్ర , నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లా ప్రకటనను హర్షిస్తున్న పశ్చిమ ప్రాంత ప్రజలు

## జీర్ణించుకోలేని వైసిపి నాయకులు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి










**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 10)**

పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన మార్కాపురం జిల్లా గా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో ప్రజలందరూ హర్షిస్తుంటే కేవలం వైసీపీ నాయకులు మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. వైసీపీ హయాంలో జిల్లాల విభజనలో వివక్షత చూపిన వైసిపి నాయకులు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మార్కాపురం జిల్లాగా ప్రకటించడంతో జీర్ణించుకోలేక పలువురు నాయకులు అవాకులు, చవాకులు పేలుస్తున్నారన్నారు. త్వరలో వారికి కూడా సరైన సమయంలో కౌంటర్ ఇవ్వక తప్పదన్నారు. జిల్లాగా ప్రకటించినట్లయితే ఈ ప్రాంత ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారన్నారు. రైతు సోదరులు కోటీశ్వరులు అవుతారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. అనేక రకాల పరిశ్రమలు వస్తాయి అన్నారు. దీంతో ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. విద్య, వైద్యం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికే రిలయన్స్ కంపెనీ వచ్చిందన్నారు. మార్కాపురానికి మిర్చి యార్డు కూడా వస్తుందన్నారు. ఒక్కసారి అంటూ జగన్మోహన్‌రెడ్డి పశ్చిమ ప్రాంత ప్రజల ఓట్లన్నీ దండుకున్నాడే తప్ప ఈ ప్రాంత ప్రజలకు ఏమి ఒరగబెట్టలేదన్నారు. జిల్లా కోసం, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసినందుకు అనేక రకాల పోరాటం చేసినప్పటికీ వైసీపీ నాయకులలో ఏ మాత్రం చలనం లేదన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయకుండానే పూర్తి చేసినట్లు ఆర్భాటంగా ప్రారంభించడం ప్రజలు గమనించారన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత నాదేనన్నారు. జిల్లా పోరాట సమయంలో టిడిపి నాయకుల పై వైసీపీ ప్రభుత్వం కేసులు బనాయించిందన్నారు. పశ్చిమ ప్రాంత ప్రజల కలలను సాకారం చేసేందుకే ఆ దేవుడు నాకు మరల పునర్జన్మనిచ్చాడన్నారు. పశ్చిమ ప్రాంత ప్రజల యొక్క కష్టసుఖాలు తెలిసిన చంద్రబాబునాయుడు మనకు జిల్లాను ప్రకటిస్తే, ఆయన పేరు పెట్టుకోవడంలో తప్పేందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ, జగనన్న గోరుముద్దలు, మన తాతలు ముత్తాతలు, తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులైన పట్టాదారు పాసు పుస్తకాల మీద జగన్మోహన్‌రెడ్డి పేరు పెట్టుకోవచ్చా, వాళ్లదైతే రాజకీయం, మనదైతే రాజకీయం కాదా ఆలోచించండి వైసీపీ నాయకులు తీరును అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దౌర్జన్యాలు, భూఆక్రమణలు, మద్యం, ఇసుక, గ్రావెల్ దోచుకోవడం తప్ప, ఇచ్చిన మాటలను నిలబెట్టుకోక పోవడం లాంటి దుర్మార్గమైన చర్యలతో రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చడం తప్ప ఏం అభివృద్ధి చేశారో వైసిపి నాయకులు చెప్పాలని కోరారు. మార్కాపురంనియోజకవర్గ ప్రజలకు ఏమి చేసింది లేక ఏదో ఒకరకంగా బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జిల్లా వస్తే అన్ని వర్గాల ప్రజలు బాగుపడతారన్నారు. కేవలం టిడిపికి చెందినవారే కాదన్నారు. వైసీపీ నాయకుల యొక్క తీరుతెన్నులను ప్రజలు బాగా అర్థం చేసుకోవాలన్నారు. మన నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏ నాయకులు పనిచేస్తున్నారో, ఏ నాయకులు పని చేయడం లేదో గమనించాల్సిన బాధ్యత మీ విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఇప్పటికైనా ప్రజలు వైసీపీ నాయకుల యొక్క మాయ మాటలను నమ్మొద్దన్నారు. ముందుగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి సీతా నాగులవరం గ్రామ మాజీ ఎంపీటీసీ గోపీనాథ్ ఆధ్వర్యంలో ప్రజలు కందులకు ఘన స్వాగతం పలికారు. కందులకు రాష్ట్ర కమ్మ సంఘం వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యదర్శి పుచ్చనూతల గోపీనాథ్ చౌదరి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు, ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షులు కంచర్ల కాశయ్య, మండల మాజీ ఎంపీపీ పులి వేముల ఏసుదాసు, మండల టిడిపిపార్టీ మాజీ కన్వీనర్ వి జాన్, పి గోపీనాథ్ చౌదరిలు సంయుక్తంగా మాట్లాడుతూ సీత నాగులవరంలో జిల్లా సాధనకోసం మొదటగా కాగడాల ప్రదర్శనతో ప్రారంభించడం జరిగిందని, దీంతో దిగ్విజయం సాధించిందని సభలో గుర్తుచేశారు. కందులనారాయణరెడ్డి పశ్చిమ ప్రాంత ప్రజల కోసం అధికారంలో ఉన్న, ప్రతిపక్షంలో ఉన్న ఆయన పోరాటం మరవలేనిదన్నారు. ఆయన ధ్యేయం పశ్చిమ ప్రాంత ప్రజల అభివృద్ధియే అన్నారు. అందరి నాయకులను కలుపుకొని జిల్లా సాధన కోసం పోరాడిన ఏకైక వ్యక్తి అన్నారు. ఈ ప్రాంత ప్రజలందరూ ఆయనకు రుణపడి ఉండాలన్నారు. కందులను ఇంకా ఉత్తేజ పరిచేందుకు అందరి ఆశీస్సులు పుష్కలంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కూచిపూడి రోషప్ప నాయుడు, గుర్రపు సాల నరసింహారావు, నాగ తిరుపతయ్య, గురవయ్య, మాదాల వెంకటేశ్వర్లు, ఐటిడిపి రంగసాయి, టి వెంకటేశ్వరరెడ్డి, సురేపల్లి మాజీ సర్పంచ్ గ్రంధి మోహన్, నావి తిరుపతయ్య, కే సోమయ్య, కోలగట్ల కాశీశ్వర రెడ్డి, టిడిపి మండల యూత్ నాయకుడు మేకల వెంకట్, ఈర్ల వెంకటయ్య, కుందురు చిన్న కాశిరెడ్డి, కాలంగి శ్రీనివాసులు, జి సుబ్బయ్య, ఈర్ల పెద్ద కాశయ్య పాల్గొన్నారు. అనంతరం సీతా నాగులవరం గ్రామ నాయకులు, గ్రామమహిళలు చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం ఘనంగా చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం



**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, డిసెంబర్ 7)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాను ప్రకటించిన నేపథ్యంలో బుధవారం మండలంలోని గనివనిపాడు పంచాయతీలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్ మాట్లాడుతూ మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి 63 రోజుల పాటు వివిధ పోరాటాలు చేసినా వైసీపీ నేతలు జిల్లాను ఏర్పాటు చేయడం ఘోరంగా వైఫల్యం చెందారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లాను ప్రకటించి కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు మూరబోయిన బాబురావు యాదవ్ ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కుందురు కాశిరెడ్డి, గొట్లగట్టు సర్పంచ్ పెరికే సుఖ్‌దేవ్ (బూన్), తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముప్వ కాటంరాజు, కనకం నరసింహారావు, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరెడ్డి, వెంకట నారాయణ, పారా వెంకటేశ్వర్లు, శ్రీను, ప్రభాకర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 77వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, డిసెంబర్ 10)**

1948 డిసెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటారని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను ఆమోదించిన రోజును గుర్తు చేసుకుంటూ, మానవులందరికీ ఉండే స్వేచ్ఛ సమానత్వం, గౌరవాలను గుర్తుచేస్తూ మానవ హక్కుల ఉల్లంఘన పై అవగాహన పెంచటానికి, వాటి పరిరక్షణకు కృషి చేయటానికి ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని, ప్రతి మనిషి తమ హక్కులను తెలుసుకొని స్వేచ్ఛగా జీవించాలని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను గురించి దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మరియు పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కుక్కమూడి ప్రసాద్ వివరించాడు. 77వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం మాచర్ల పట్టణం లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్కు నందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కుక్కమూడి ప్రసాద్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి మాట్లాడుతూ స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం ఓటు హక్కు భారత రాజ్యాంగం మనకు కల్పించినప్పటికీ ప్రతిరోజు హక్కులకు ఏదో ఒకచోట భంగం కలుగుతుందని, హక్కులకు భంగం కలిగితే మానవ హక్కుల కమిషన్కు ఫిర్యాదు చేయాలని తెలియజేశారు.శ్రీ వీరబ్రహ్మేంద్ర జాతీయ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గురజాల అప్పారావు మాట్లాడుతూ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. ప్రజలు వివిధ పనులు మీద ఆఫీసుకు వచ్చే ప్రతి పౌరుడు ని అధికారులు గౌరవించాలని, వారి హక్కులకు భంగం కలిగించవద్దని వారి పనులను సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడక తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీటీసీ పరిమళ రాజారావు, దళిత నాయకులు కుక్కమూడి నెహెమ్యా, పేరుపోగు అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.